

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీపొట్టిశ్రీరాములు
నెల్లూరు
ఆదివారం 3 మార్చి 2024







వీపీఆర్ కన్వెన్షన్ హాలులో జరిగిన సభలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు, ప్రసంగిస్తున్న నారా చంద్రబాబు నాయుడు

ఉరకలెత్తిన ఉత్సాహం!

ఓ వైపు తెలుగుదేశం పార్టీ శ్రేణులు, మరోవైపు మిత్రపక్షం జనసేన సైనికులు.. ఇంకోవైపు వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు తరలివచ్చిన నాయకులు, వారి అనుచరులతో శనివారం గొలగమూడి ప్రాంతం పోటెత్తిపోయింది. వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్ కిటకిటలాడింది. కొత్త నాయకుల చేరికలు, పాత కార్యకర్తల కేరింతల నడుమ టీడీపీ అధినేత నారా చంద్రబాబు ఉత్సాహంగా కనిపించారు. ఆవేశంగా ప్రసంగించారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతుల వ్యక్తిత్వాన్ని ప్రశంసించారు. ఇప్పటికే ముగ్గురు గొప్ప నాయకులు ఆనం, శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిల చేరికతో బలంగా ఉన్న నెల్లూరులో చివరి బ్రహ్మాస్త్రంలా వీపీఆర్, ఆయన వర్గీయుల చేరికతో ఇక తిరుగు ఉండదన్నారు. ఆనందంగా, ఆవేశంగా, అర్థవంతంగా చలోక్తులతో సాగిన చంద్రబాబు ప్రసంగం ప్రజలను ఆకట్టుకొంది. కొత్త చేరికలతో ఊరూరా వైసీపీ ఓటు బ్యాంకు చీలిందనే విశ్లేషణలు ఊపందుకున్నాయి.

- చంద్రబాబు సభకు పోటెత్తిన జనం
- రక్తికట్టించిన చేరికల కార్యక్రమం
- అన్నీ గెలిచి చరిత్ర సృష్టించాలని అధినేత పిలుపు
- వీపీఆర్ వర్గం చేరికలతో టీడీపీలో జోష్



చంద్రబాబుకు శ్రీవారి విగ్రహాన్ని అందజేస్తున్న వేమిరెడ్డి దంపతులు



సభా ప్రాంగణంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన చంద్రబాబు, పక్కన టీడీపీ ముఖ్యనాయకులు

నెల్లూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి/సిటీ) : ఈ సభలో చంద్రబాబు మాట్లాడుతూ తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో 5 ఎన్నికలకు అభ్యర్థులను ఎంపిక చేశానన్నారు. ఏ ఎన్నికల్లో లేనివిధంగా ఈసారి అన్ని కోణాల్లో ఆలోచించి కట్టుదిట్టంగా అభ్యర్థులను ఎంపిక చేశానన్నారు. చివరికి వీపీఆర్‌ను పార్టీలో తీసుకోవడానికి ముందు ఆయన గురించి ప్రజాభిప్రాయం తెలుసుకున్నానని అన్నారు. ఆయన డబ్బు కోసం రాజకీయాల్లో రాలేదు.. సేవ కోసం వచ్చారనే అభిప్రాయమే వ్యక్తమయ్యిందన్నారు. డిప్యూటీ స్పీకర్ రూప్‌కుమార్ సమర్థవంతమైన నాయకుడని, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడారని అన్నారు.

• విజయసాయిని సాగనంపండి

తెలుగుదేశం వీపీఆర్‌ను నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించడానికి ముందే వైసీపీ తన అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని ప్రకటించిందని చంద్రబాబు అన్నారు. విశాఖను దోచుకుతిన్న విజయసాయిని ఇప్పుడు నెల్లూరు మీదకు పంపారన్నారు. అవినీతిపరుడైన విజయసాయి చివరి వరకు అభ్యర్థిగా ఉంటారో లేదో తెలియదని, ఒకవేళ ఉంటే చిత్తుచిత్తుగా ఓడించాలని చంద్రబాబు ప్రజలను కోరారు.



తమ్ముళ్లకు అభివాదం చేస్తూ..

• 11 గెలిచి చరిత్ర సృష్టించండి

'నెల్లూరు జిల్లాలో తెలుగుదేశం బలంగా ఉంది. దానికి తోడు ఇటీవల వైసీపీ నుంచి కోటంరెడ్డి శ్రీధర్, ఆనం రామనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డిలు చేరడంతో ఇంకా బలపడింది. చివరి అస్త్రంగా వీపీఆర్ చేరారు. నెల్లూరు జిల్లాలో ఇక పార్టీకి తిరుగులేదు" అని చంద్రబాబు అన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 11కు 11 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలను సునాయాసంగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు రాజకీయ చైతన్యం కలిగిన జిల్లా అని, ఇక్కడ జరిగే రాజకీయ పరిణామాలు రాష్ట్ర భవిష్యత్ పరిణామాలను తెలియజేస్తాయన్నారు.



యుటీఎఫ్ నాయకుల వినతి

• ఊరూరా చీలనున్న వైసీపీ ఓటు బ్యాంకు

వీపీఆర్‌తోపాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందలాది మంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. ఇటు కందుకూరు నుంచి అటు సూళ్లూరుపేట వరకు మున్సిపాలిటీలు, మండల, పంచాయతీల స్థాయిలో ప్రజలను ప్రభావితం చేయగలిగిన వారంతా సైకిల్ ఎక్కారు. వీరి చేరికతో టీడీపీకి రెండు రకాల ప్రయోజనాలు కలగనున్నాయి. టీడీపీ ఖాతాలోకి అదనపు ఓట్లు జమ కావడంతోపాటు ఇప్పటివరకు నాయకత్వమే లేని గ్రామాలు, పట్టణాల్లో టీడీపీకి పట్టు దొరికినట్లు అయ్యింది. అదే సమయంలో దాదాపుగా అన్ని మండలాల నుంచి వైసీపీ నాయకులు వలసొచ్చి టీడీపీలో చేరడంతో దాదాపుగా ఊరూరా వైసీపీ ఓటు బ్యాంకులో చీలిక అనివార్యంగా కనిపిస్తోంది.

మంచి టీమ్ సెట్ అయ్యింది!

- పాత, కొత్త కలిసి పని చేయండి
- అన్ని సీట్లు గెలవాలి. అందరికీ న్యాయం చేస్తా
- పార్టీ నాయకులకు చంద్రబాబు భరోసా

నెల్లూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : గతంలో ఎప్పుడూ లేనంత గొప్పగా నెల్లూరు జిల్లాలో మంచి టీమ్ ఫాం అయ్యిందని, అన్ని సీట్లు గెలిచి తీరాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా నాయకులను చంద్రబాబు ఆదేశించారు. సభ అనంతరం కొంతసేపు బస్సులో జిల్లా నాయకులతో చంద్రబాబు మాట్లాడారు. నెల్లూరు జిల్లాలో అభ్యర్థులు, నాయకుల కూర్పు పట్ల సంతోషాన్ని, సంతృప్తిని వ్యక్తం చేశారు. వైసీపీ నుంచి మంచి పేరున్న బలమైన నాయకులు టీడీపీలోకి రావడం మంచి పరిణామమని అన్నారు. ఇప్పుడు అన్ని నియోజకవర్గాల్లో బలమైన నాయకత్వం ఉందని, పాత కొత్త నాయకులంతా కలిసి పని చేయాలని సూచించారు. జనసేన, వైసీపీ నుంచి వచ్చిన కొత్త వారిని కలుపుకొని ముందుకు వెళ్లలన్నారు. మీ భవిష్యత్తు పట్ల ఆందోళన చెందవద్దని, ప్రతి ఒక్కరికి తప్పక న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వీపీఆర్, నియోజకవర్గ ఇన్‌చార్జులు కావ్య కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, పాశిం సునీల్, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, కాకర్ల సురేష్, నెలవల సుబ్రహ్మణ్యం, పనబాక లక్ష్మి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయాలనే రాజకీయాల్లోకి వచ్చా



దేవుని కృపతో నాకు సాధ్యమైన మేర ప్రజలకు సేవ చేస్తున్నా. మరింత ఎక్కువగా ప్రజలకు సేవ చేయాలంటే రాజకీయాల్లోకి రావాలని కొంత మంది చేసిన సూచనల మేరకు రాజకీయాల్లోకి వచ్చాను. ఇప్పుడు టీడీపీ అభ్యర్థిగా నెల్లూరు పార్లమెంట్‌కు పోటీ చేస్తున్నా. ప్రజల మద్దతు, ఆశీర్వాదాలు నాకు కావాలి. అందరూ మద్దతు ఇచ్చి గెలిపిస్తే వ్యక్తిగతంగా నా వంతు సేవ చేయడంతోపాటు ఎంపీగా పార్లమెంట్‌లో పోరాడి ఈ ప్రాంత అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా.

- వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

నేటి నుంచి పల్స్‌పోలియో

- 2.93 లక్షల మంది చిన్నారుల గుర్తింపు
- 2,396 పోలియో బూత్‌లు
- 9924 మందికిపైగా సిబ్బంది



పోలియో మహమ్మారిని శాశ్వతంగా పారద్రోలేందుకు ప్రభుత్వం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం ఈ ఆదివారం నుంచి జరగనుంది. జిల్లా వ్యాప్తంగా ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించి వైద్య సిబ్బంది పోలియా చుక్కల మందు వేస్తారు. ఏ చిన్నారీ ఆ వ్యాధి బారిన పడకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం రెండు దశాబ్దాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రస్తుతం జరగబోయేది 54వ కార్యక్రమం.

నెల్లూరు (వైద్యం), మార్చి 2 : జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాలలోపు వయసున్న చిన్నారులు మొత్తం 2,93,536 మందికి పోలియో చుక్కలు వేయాలని అధికారులు గుర్తించారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 1,87,706 మంది, పట్టణ ప్రాంతాల్లో 1,05,830 మంది చిన్నారులు ఉన్నారు. వారిలో 7038 మంది పోలియో బారినపడే అవకాశమున్న నిర్ధారించారు. జిల్లా వ్యాప్తంగా పోలియో చుక్కలు వేసేందుకు వైద్య ఆరోగ్య శాఖకు 3,03,940 డోసుల వాక్సిన్ వచ్చింది. కావలి, జొన్నవాడ, కలిగిరి, ఉదయ గిరి, కొడవలూరు, మహిమలూరు వింజమూరులో స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసి జిల్లావ్యాప్తంగా అన్ని బూత్‌లకు చుక్కల మందు పంపిణీ చేస్తున్నారు. 'పల్స్ పోలియో' కోసం 2396 బూత్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 1964, పట్టణ ప్రాంతాల్లో 432 అందుబాటులో ఉంచారు. జిల్లాకు వలస వచ్చే కూలీలు, ఇతర జిల్లాల నుంచి వచ్చే సంచార జీవుల పిల్లలకు ప్రత్యేకంగా పోలియో చుక్కలు వేసేందుకు వాహనా లను సిద్ధం చేశారు. వీరి కోసం 65 మొబైల్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఇక, రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్లలో ప్రయాణికుల పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు కూడా 85 ప్రత్యేక బూత్‌లను ఏర్పాటు చేశారు. మొత్తం 9924 మంది సిబ్బందికి విధులు కేటాయించారు. ఒక్కొక్క బూత్‌లో నలు గురు ఉండి పోలియో చుక్కలు వేస్తారు. బూత్‌ల పర్యవేక్షణకు 249 మంది రూట్ సూపర్ వైజర్లను, పర్యవేక్షణకు ప్రోగ్రాం అధికారులను నియమించారు. పల్స్ పోలియో నిర్వహణకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ రూ.37,82,465ను జిల్లాకు కేటాయించింది. ఈ మొత్తాన్ని సిబ్బంది గౌరవ వేతనం, ప్రచారం, నిర్వహణ ఖర్చులకు వినియోగించనున్నారు. పల్స్ పోలియోను విజయవంతం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఏదైనా కారణంతో ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులకు 4,5,6 తేదీలలో వారి నివాసాలకు వెళ్లి వ్యాక్సిన్ వేస్తారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

పల్స్‌పోలియోకు అన్ని ఏర్పాట్లు చేశాము. ఆదివారం ఉదయం 6.30 గంట లకే కేటాయిం చిన బూత్‌లకు సిబ్బంది చేరుకుని సాయంత్రం ఆరు గంటల వరకు చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారు. పోలియో బూత్‌లకు రాలేని చిన్నారుల కోసం ఇంటింటికి వెళ్లి వ్యాక్సిన్ వేస్తారు. హైరిస్క్ ప్రాంతాల్లో ప్రత్యే క బృందాలు సేవలు అందిస్తాయి. తల్లిదండ్రులు వారి పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి.

- డాక్టర్ పెంచలయ్య, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి



పల్స్‌పోలియో ర్యాలీలో అధికారులు, ఉద్యోగులు...



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నగరంలో ర్యాలీ

పల్స్‌పోలియో ప్రచార ర్యాలీ శనివారం నెల్లూరు నగరంలో జరిగింది. గాంధీబొమ్మ నుంచి వీఆర్సీ కూడలి వరకు జరిగిన ఈ ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ, డీఐవో డాక్టర్ సెరీనాకుమారి, శాఖవరపు వేణుగోపాల్, రోటరీక్లబ్, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, పల్స్‌పోలియో కార్యక్రమంపై రూపొందించిన పోస్టర్ కలెక్టర్ హరినారాయణన్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, డీసీ హెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్ తదితర వైద్యాధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి మూలస్థానేశ్వరుడి బ్రహ్మోత్సవాలు




మూలాపేట మూలస్థానేశ్వరాలయం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 2 : నెల్లూరులో వెలసిన మూలస్థానేశ్వరస్వామికి ఆదివారం నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. భక్తుల కోసం చలువ పందిళ్లు, క్యూలైన్లు, విద్యుద్దీపాలంకరణ ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, విశేష పూజలు, పూలంగిసేవ, సాయంత్రం విశేష కార్యక్రమాలు జరగనున్నాయి. తొలిరోజు ఆదివారం సాయంత్రం అంకురార్పణ, 4వతేదీ ఉదయం 9గంటలకు ధ్వజారోహణ, సాయంత్రం సింహ వాహనం సేవ, 5వతేదీ ఉదయం చప్పర ఉత్సవం, పురుషామృగ వాహనంపై అలంకరణ, 6వతేదీ ఉదయం చప్పర ఉత్సవం, రాత్రి శేషవాహన సేవ, 7వతేదీ చప్పర ఉత్సవం, రాత్రి వెండి రావణసేవ, 8వతేదీ మహాశివరాత్రి సందర్భంగా గిన్నెభిక్ష, రాత్రి లింగోద్భవకాల అభిషేకం, రాత్రి 1గంటకు వెండి నందిసేవ, 9వతేదీ స్వామివారి కల్యాణం అనంతరం గజవాహన సేవ, 10వతేదీ ఉదయం 9గంటలకు రథోత్సవం, 11వతేదీ ఉదయం చప్పర ఉత్సవం, రాత్రి పులివాహన సేవ, 12వతేదీ ఉదయం చప్పర ఉత్సవం, రాత్రి అలకలతోపు, 13వతేదీ ఉదయం తీర్థవాది, రాత్రి ధ్వజావరోహణం, తిరుచ్చి ఉత్సవం, 14వతేదీ దవనోత్సవం, 15వ తేదీ రాత్రి ఏకాంతసేవ జరగనున్నాయి. మూలాపేటలోని అన్నపూర్ణా సమేత నీలకంఠేశ్వరస్వామి, ఉస్మాన్ సాహెబ్‌పేట కాశీవిశ్వనాథస్వామి ఆలయాల్లోనూ శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి.

ధాన్యం కొనుగోళ్ల ఊసేది!?

- జిల్లాలో మొదలైన వరి కోతలు
- వారంలో ఊపందుకోనున్న దిగుబడులు
- ఇప్పటికీ మొదలుకాని కొనుగోళ్ల ప్రక్రియ
- పీపీసీలు ఏర్పాటు చేయకపోతే రైతులకు నష్టం

నెల్లూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్ చివరి దశకు చేరుకుని వరి కోతలు ప్రారంభమయ్యాయి. ముందుగా నాట్లు వేసిన ప్రాంతాల్లో కోతలు జరుగుతున్నాయి. మరో వారం రోజుల్లో వరి కోతలు ఊపందుకోనున్నాయి. కానీ ఇప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఊసు కనిపించడం లేదు. కనీసం ఆ దిశగా క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు కూడా జరుగుతున్నట్లు తెలియడం లేదు. బహిరంగ మార్కెట్లో ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉన్నాయన్న కారణంతో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. కేంద్రాలను ఏర్పాటు చేయడం, మిల్లర్ల నుంచి బ్యాంక్ గ్యారెంటీలు తీసుకోవడం, ఆ తర్వాత పీపీసీలను ఆ మిల్లులకు ట్యాగ్‌ఆన్ చేయడం.. వంటి ప్రక్రియలు జరగాల్సి ఉంది. ప్రస్తుతానికి ధరలు కనీస మద్దతు ధర కన్నా ఎక్కువగానే మార్కెట్లో ఉన్నా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే దళారులు అమాంతం ధాన్యం ధరలు తగ్గించే ప్రమాదం ఉంది. గతేడాది ఈ పరిస్థితిని రైతులు అనుభవించారు. మొదట్లో అధికారులు కొనుగోళ్లను పట్టించుకోకపోవడంతో పుట్టి రూ.21 వేలకుపైగా ఉన్న ధాన్యం ధరలు ఆ తర్వాత రూ.18 వేల దిగువకు పడిపోయాయి. ఇప్పుడు కూడా అదేమాదిరిగా వ్యవహరిస్తే ఆ ప్రభావం రైతులపై పడుతుంది. ధాన్యం కొనుగోళ్లను సమీక్షించాల్సిన జాయింట్ కలెక్టర్ లేకపోవడం, కొనుగోళ్లను పర్యవేక్షించాల్సిన పౌరసరఫరాల సంస్థ డీఎం కొత్తవారు కావడంతో రైతుల్లో ఒకింత ఆందోళన కనిపిస్తోంది.



దళారులతో జాగ్రత్త!

రబీ సీజన్‌లో అతికష్టం మీద రైతాంగం సాగు చేస్తోంది. వర్షాలు కురవకపోవడం, ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా లేకపోవడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. అధికారిక, అనధికార ఆయకట్టు మొత్తం సుమారు ఆరు లక్షల ఎకరాలకుపైగా ఉండగా ప్రస్తుతం మూడు లక్షల ఎకరాల్లోపే నీరు ఇవ్వగలిగారు. గతేడాది నార్లు పోసుకున్నాక మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో ఆ నార్లు మునిగిపోయాయి. దీంతో చాలా చోట్ల రైతులు మళ్లీ నార్లు పోసుకోవాల్సి వచ్చింది. ఇలా పెట్టు బడి కూడా పెరిగింది. గతేడాది ఇదే సీజన్‌లో మొత్తంగా ఐదు వేల మెట్రిక్ టన్నులకు మించి పీపీసీల ద్వారా కొనుగోళ్లు జరగలేదు. పలు దేశాల్లో సాగు తగ్గడం, బియ్యానికి డిమాండ్ పెరగడంతో ధాన్యానికి అంతర్జాతీయంగా మంచి ధర లభించింది. ప్రస్తుతం బియ్యం ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దేశంలోని వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది కూడా ధాన్యానికి మంచి ధర లభిస్తుందని రైతాంగం ఆశిస్తోంది. అయితే దళారులు కుమ్మక్కై ధరను తగ్గించకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కాగా పీపీసీల ఏర్పాటుపై పౌరసరఫరాల సంస్థ డీఎం లక్ష్మీనరసింహారావును సంప్రదించగా పీపీసీల ఏర్పాటు ప్రక్రియ జరుగుతున్నట్లు చెప్పారు. ఆర్‌బీకేలు, పీఏసీఎస్‌లలో పీపీసీల ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.



జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో శిక్షణ పొందుతున్న జిల్లా పోలీసులు

కొత్త చట్టాలపై పోలీసులకు శిక్షణ

నెల్లూరు(క్రైం), మార్చి 2: రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు మూడు కొత్త చట్టాలపై తిరుపతి పోలీస్ ట్రైనింగ్ కళాశాల నుంచి ఆరు జిల్లాల పోలీసు అధికారులకు ఆరు రోజులు జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ తరగతులకు శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లలో సిబ్బంది హాజరయ్యారు. హైదరాబాద్ కేంద్ర ప్రభుత్వ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ పొందిన అధికారులు జూమ్ సమావేశంలో పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

ఆరోగ్య మిత్రల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (వైద్యం), మార్చి 2 : ఆరోగ్యశ్రీ విభాగంలో ఖాళీగా ఉన్న ఆరోగ్యమిత్ర పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ విభాగం జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ చంద్ర శేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 18 ఖాళీలు భర్తీ చేస్తామని, ఆసక్తి గల వారు ఈ నెల 6లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఆరోగ్యశ్రీ జిల్లా కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. రిజర్వేషన్, మెరిట్ ఆధారంగా ఈ నియకాలు జరుగుతాయని తెలియచేశారు.

పటిష్టంగా విద్యా హక్కు చట్టం అమలు

- కేజీబీవీ కార్యదర్శి మధుసూదన్‌రావు



మాట్లాడుతున్న కేజీబీవీ కార్యదర్శి మధుసూదన్‌రావు

నెల్లూరు (స్టోన్ హౌస్ పేట), మార్చి 2: రాష్ట్రంలో విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు కేజీబీవీ కార్యదర్శి డీ మధుసూదన్ రావు తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది రాష్ట్రంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో 50వేల మంది విద్యార్థులకు విద్యాహక్కు చట్టం ద్వారా అడ్మిషన్లు కల్పిస్తున్నామని, అందుకు సంబంధించి అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం ద్వారా అడ్మిషన్లపై ఇప్పటికే అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈ నెల 5 నుంచి ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రతి ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లు విద్యాహక్కు చట్టం కింద ఇవ్వాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని, జిల్లాలో 32,834 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. 176 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని, డిపార్ట్‌మెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఏపీసీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధీపురంలో దొంగతనాలు

- మూడు ఇళ్లలో బంగారం, రూ.5వేల నగదు చోరీ
- క్లూస్ టీమ్ వేలిముద్రల సేకరణ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్ పోలీసులు

సంగం, మార్చి 2: సిద్ధీపురంలో శుక్రవారం రాత్రి మూడు ఇళ్లల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రెండు ఇళ్లల్లో ఏం లేకపోవడంతో చోరీ జరగలేదు. మూడో ఇంట్లో 2 గ్రాముల బంగారం, రూ.5వేల నగదు తీసుకెళ్లి నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన షేక్ మహబూబ్‌జా అనే వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉంటుం ది. నాలుగురోజుల కిందట నెల్లూరులోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఈమె ఇంటి తలుపులు పగలకొట్టి ఉండటాన్ని శనివారం ఉదయం స్థానికులు గుర్తించి వృద్ధురాలికి సమాచారం అందించారు. ఆమె హుటాహుటిన గ్రామానికి వచ్చి ఇంట్లో చూడగా విలువైన సామన్లు కన్పించనటు తెలిపింది. అలాగే షేక్‌మౌలాలి అనే వ్యక్తికి పక్కపక్కనే రెండు ఇండ్లు ఉన్నాయి. రోజు మాదిరిగానే ఓ ఇంట్లో కుటుంబసభ్యులు నిద్రించగా తాళం వేసిన మరో ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. బీరువా తాళాలు పగలకొట్టి అందులోని రెండు గ్రాముల బంగారు ఉంగరం, రూ.5 వేల నగదు తీసుకెళ్లారు. అదేవిధంగా గ్రామానికి చెందిన శ్రీహరి అనే వ్యక్తికి కూడా రెండు ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. కుటుంబసభ్యులు ఓ ఇంట్లో నిద్రించగా మరో ఇంటికి తాళం వేసి ఉంది. తాళం వేసిన ఇంటి గెడి పగలకొట్టారు. కానీ ఇంట్లో ఏమీ సామన్లు లేకపోవడంతో చోరీ జరగలేదు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

కావలి రూరల్, మార్చి 2: మహిళపై అత్యాచారయత్నానికి ప్రయత్నించి, అడ్డు వచ్చిన ఆమె బిడ్డపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఆటో డ్రైవర్ బలగాని సురేష్‌ను శనివారం పోలీస్‌లు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని సంకులవారి తోటలోని సాయిబాబా గుడి ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఎక్కడికైనా బయటకు వెళ్లాలంటే తన భర్తకు పరిచయం ఉన్న తుఫాన్‌నగర్‌కు చెందిన సురేష్ ఆటోను బాడుగకు తీసుకుని వెళ్లేది. ఈ క్రమంలో గత నెల 27వ తేదీ రాత్రి ఆమె ఇంటికి వచ్చిన సురేష్ ఒంటరిగా ఉన్న ఆమెపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో నిద్రపోతున్న ఆమె 8 ఏళ్ల కుమార్తె నిద్రలేవగా ఆ చిన్నారిపై దాడి చేసి హత్యాయ్నానికి పాల్పడ్డారు. దీంతో ఆమె గట్టిగా కేకలు వెయ్యడంతో చుట్టుపక్కల వారు వస్తారని అక్కడ నుంచి పారారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ జమాలుద్దీన్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైం), మార్చి 2: నెల్లూరులోని వేదాయపాళెం రైల్వే స్టేషన్ వద్ద శనివారం రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందింది. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ ఎన్ హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలు ఎవరని తెలుసుకునే ఆధారాలు లభించలేదు. మృతదేహంపై ఎరుపు రంగు మీద నలుపు డిజైన్ చీర, సిమెంట్ రంగు లంగా, నలుపు రంగు జాకెట్ ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

- 22,974 మంది హాజరు
- రాపూరులో రెండు మాల్‌ప్రాక్టీస్ కేసుల నమోదు

నెల్లూరు (స్టోన్ హౌస్‌పేట), మార్చి 2: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు జిల్లా వ్యాప్తం గా శనివారం 81 కేం ద్రాల్లో ప్రారంభమ య్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జనరల్ విద్యార్థులు 22,219 మంది హాజరు కావాల్సి ఉండగా 21,785 మంది హాజరయ్యా రు, 432 మంది గైర్హాజరయ్యారు. వృత్తివిద్యా కోర్సుల్లో 1,281 మంది హాజరు కావాల్సి ఉండగా 1189 మంది హాజరయ్యారు, 92 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 23,500 మందికిగాను 22,974 మంది హాజరుకాగా, 524 మంది గైర్హాజరయ్యారు. రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యా యని ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షకుడు డాక్టర్ ఏ శ్రీనివాసులు తెలిపారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఐవో శ్రీనివాసులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	147
లేయర్ లైవ్	70
స్కిన్ చికెన్	254
స్కిన్‌లెస్	284
లేయర్	120

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6063
వెండి కిలో ధర	రూ. 72,900
వెండి ఒక గ్రాము	రూ. 74.90

ఈసీ ఆదేశాల మేరకు ఎన్నికలకు ఏర్పాట్లు

- కలెక్టర్ హరినాయణన్



అధికారులకు శిక్షణ ఇచ్చే భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

ఉదయగిరి రూరల్, మార్చి 2: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని నియోజకవర్గాల్లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. శనివారం పట్టణంలోని ఆర్వో చాంబర్, నామినేషన్‌ల స్వీకరణ కేంద్రం, ఈవీఎంల పంపిణీ.. ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చే కేంద్రాలను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేసి మాట్లాడారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఈ నియోజకవర్గంలో 323పోలింగ్ కేంద్రాలుండగా ఎన్నికల నిర్వహణకు వెయ్యి మంది సిబ్బంది అవసరం ఉందన్నారు. ఈవీఎంల పంపిణీ కేంద్రంలోనే సిబ్బందికి ఎన్నికల సంబంధించిన శిక్షణ ఇస్తామన్నారు. ఈసీ నిబంధనల మేరకు రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణకు అన్నిఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం దుత్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజా రమేష్ ప్రేమ్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారి నెహ్రూబాబు పాల్గొన్నారు.

ఎన్నికల కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నాం : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), మార్చి 2 : నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎన్నికల సెంట్రల్ కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ఎం హరినారాయణన్ తెలిపారు. ఆయన శనివారం కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలపై ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్ష జరిపారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారం, ఫిర్యాదులు, సమస్యలు, జప్తు చేసినవి, సంఘటనలు కంట్రోల్ సెంటర్‌కు వస్తాయని, వాటిని ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు, టీములకు తెలియచేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, సోషల్ మీడియా పోస్టింగులను పరిశీస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లవన్న, ఏఎస్పీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనారాయణుల కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 2 : నగరంలోని వీఆర్సీ మైదానంలో జరుగుతున్న అష్టలక్ష్మీ యాగంలో భాగంగా శనివారం రాత్రి లక్ష్మీనారాయణుల కల్యాణం ఘనంగా జరిగింది. అష్టలక్ష్మీ పీఠం వ్యవస్థాపకుడు పీతాంబరం రఘునాథాచార్యస్వామి ఆధ్వర్యంలో ఉదయం పెరుమాళ్ ఆరాధన, అభిషేకం, అర్చన, బాల భోగ నివేదన, మంగళ శాసనం, తీర్థప్రసాద వితరణ జరిగాయి. సంతానం కోసం పుత్రకామేష్టి యాగం జరిగింది. అనంతరం 22వ అష్టలక్ష్మీ యాగ మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అష్టలక్ష్మీ వైభవ దీపిక, ఆధ్యాత్మిక సేవా సంస్థ, అష్టలక్ష్మీ యాగం కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పంటకోత ప్రయోగాల ద్వారా రైతుకు లబ్ధి

డీఏవో సత్యవాణి



కలిగిరిలో శనగలో పంట కోత ప్రయోగాలను పరిశీలిస్తున్న సత్యవాణి

కలిగిరి, మార్చి 2: పంటకోత ప్రయోగాల ద్వారా పంటల దిగుబడిని అంచనా వేయడం వలన రైతులకు మద్దతు ధర, బీమా సౌకర్యం వర్తిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని కలిగిరి, జిర్రావారిపాళెం గ్రామాల్లో శనగ పంటలో జరుగుతున్న పంటకోత ప్రయోగాలను శనివారం ఆమె పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లా డుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాట ధరలు కల్పించేందుకు త్వరలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నామన్నారు. శనగ, మినుము, మొక్కజొన్న పంటలు సాగు చేసిన రైతులు సీఎం యాప్‌లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను సంప్రదించి తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. పంట నమోదు ప్రక్రియ పూర్తయిన సందర్భంగా మార్చి 1 నుంచి 3 వరకు సామాజిక తనిఖీ కోసం రైతు భరోసా కేంద్రాల వద్ద జాబితా ప్రదర్శిస్తామన్నారు. పంటకోత ప్రయోగాలను సక్రమంగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నర్సోజీ రావు, ఏవో సురేష్‌బాబు, డీవైఎస్‌వో శీనయ్య, ఏఎస్‌వో వెంకటేశ్వర్లు, వీఏఏలు పాల్గొన్నారు.

వసతి, విద్య దీవెన నగదు

తల్లుల ఖాతాలో వేయవద్దు

- ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మల్లి, తదితరులు

కావలి, మార్చి 2: వసతి, విద్యా దీవెన పథకం కింద వచ్చే డబ్బులు తల్లుల ఖాతాలలో జమ చేయవద్దని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి తెలిపారు. ఈ మేరకు శనివారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడుతూ తల్లుల ఖాతాలలో వేయడం వలన వారు బ్యాంకులలో ఏదైనా అప్పులు ఉంటే వాటికి సర్వీస్ చార్జీల కింద బ్యాంకర్లు జమచేసుకుంటున్నారన్నారు. దీంతో విద్యార్థులు ఆయా విద్యా సంస్థలకు ఫీజులు కట్టలేక పోవడంతో యాజమాన్యాలు పరీక్షలకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాజ్యాంగబద్ధంగా కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం కలిపి ఎస్సీ విద్యార్థులకు స్కాలర్ సిప్‌లు ఇస్తున్నారని, ఈ ప్రభుత్వం కొత్తగా ఇచ్చిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు జరుగుమల్లి విజయరత్నం, జడ్డా వాసు, అలూరి బ్రహ్మయ్య, రమేష్, చౌటూరి రవి తదితరులు పాల్గొన్నారు

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ప్రారంభం

- నేటి నుంచి 8 వరకు కార్యక్రమాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మహిళలు

కావలి, మార్చి 2: ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం కావలి రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో ప్రారంభించారు. రెడ్‌క్రాస్, టీం సేవియర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రక్తకేంద్ర కన్వీనర్ డాక్టర్ రవికుకుమార్, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ మీసాల సుశీల, టీంసేవియర్స్ ప్రతినిధులు కీర్తి ప్రియ, తేజస్వీని, దివ్యశ్రీ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు జమున, ఉమాశర్మ, సౌందర్య దీపిక తదితరులు అంతర్జాతీయ మహిళాదినోత్సవంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీ.రవిప్రకాష్, హరినారపరెడ్డి, రఘుకుమార్‌రెడ్డి, లోకేష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కావేరిగుంట గిరిజన కాలనీకి వెళ్లి అక్కడ మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నారీ సమ్మాన్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 2 : ఈ నెల 8వ తేదీ మహిళా దినోత్సవం సందర్భంగా జేసీఐ మహిళా విభాగం వివిధ రంగాల్లో రాణించిన మహిళలకు నారీసమ్మాన్ అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు ఆ విభాగం నెల్లూరు ఎంజెల్స్ కార్యదర్శి కే విశ్వమైత్రి తెలిపారు. శనివారం సింహపురి హార్డ్‌వేర్ షాపులో జరిగిన విలేకరుల సమావేశంలో అవార్డు ప్రదానోత్సవ బ్రోచర్లు ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ నెల్లూరు ఏంజల్స్ జేసీఐ అలుమిని క్లబ్ సంయుక్తంగా మార్చి 11వతేదీ సాయంత్రం 6గంటలకు జూనియర్ టౌనుహాలులో నారీ సమ్మాన్ అవార్డుల కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ అవార్డులు కోసం అన్ని రంగాల్లో ప్రతిభావంతులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలు మిని క్లబ్ నెల్లూరు అధ్యక్షుడు కోట సత్యం మాట్లాడుతూ 18 ఏళ్ల వయసుపైబడిన మహిళామణులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 93914 91052 నెంబరును సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ ప్రసన్న కుమార్, జేసీమెంట్ రమణ్, జేసీ బిందుమాధవి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్ పార్లమెంటు



మాక్ పార్లమెంటులో యువతీ యువకులు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 2 : నెల్లూరులోని అనిత హాలులో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నైబర్‌హుడ్ యూత్ పార్లమెంటు కార్యక్రమం శనివారం జరిగింది. కేంద్ర ప్రభుత్వం క్రీడా మంత్రిత్వ శాఖ, యువజన వ్యవహారాల శాఖ, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ సంయుక్త ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా దీనిని నిర్వహించారు. ఇందులో వీఎస్‌యూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రారెడ్డి, కేంద్ర ప్రభుత్వ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ నాగసాయిసూరి, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకట సుబ్బయ్య, డాక్టర్ ఉషారాణి పాల్గొని దేశ పార్లమెంటు, అందులో చర్చలు, చట్టాలు చేయడం వంటి వాటిపై యువతకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన మాక్ పార్లమెంటు కార్యక్రమం ఆకట్టుకుంది. దీనిని ఎన్‌వైకే కోఆర్డినేటర్ మహేంద్రరెడ్డి పర్యవేక్షించారు.

సోమశిలలో 16.138 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం : సోమశిల సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా జలాశయంలో శనివారం నాటికి 16.138 టీఎంసీలు నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2300, ఉత్తర కాలువకు 600, దక్షణ కాలువకు 450 క్యూసె క్యూల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ



ఉదయగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



సంగంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఉదయగిరి రూరల్, మార్చి 2: మండలంలో ఆది, సోమ, మం గళవారాల్లో నిర్వహించే పల్స్‌పో లియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యఆరోగ్య సిబ్బంది శనివారం పట్టణ పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి శివకల్పన మాట్లాడారు. తల్లిదం డ్రులు 0-5 ఏళ్లలోపు చిన్నారులకు తప్పక పోలియో చుక్కలు వేయిం చాలని కోరారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బం ది తదితరులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బం ది పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫ్లెక్సీలు చేత పట్టి వైద్యశాల నుం చి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య క్షేత్రస్థాయి సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

లింగసముద్రం : మండలంలో ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లింగసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.రమేష్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 3014 మంది 5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు.

కలిగిరి : మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి తెలిపారు. మొత్తం 68 పోలియో కేంద్రాల ద్వారా 240 మంది సిబ్బంది పాల్గొని 4,275 మంది చిన్నారులకు పోలియోచుక్కలు వేస్తారన్నారు.

'ఎయిడెడ్'లో ప్రవేశానికి దరఖాస్తు

ఆత్మకూరు, మార్చి 2: మండంలోని ప్రైవేట్ ఎయి డెడ్ పాఠశాలల్లో 2024-25లో ఉచితంగా చేరేందుకు దర ఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి నజీర్‌బాషా తెలిపారు. ఈ నెల 14లోపు ఆధార్, రేషన్, కుల ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పట్టాల పంపిణీ

ఉదయగిరి: స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం అ ర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల భూ హక్కు పత్రాలను తహసీల్దారు నెప్రూరాబాబు, సర్పంచ్ పావులూరి సామ్రాజ్యంలు అందజే శారు. పట్టణంలోని మూడు సచివాలయాల పరిధిలో 320మందికి ఈ రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ టీసీ సభ్యురాలు పెదమస్తానీ, ఉప సర్పంచ్ ముర్తుజా హుసేన్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, మార్చి 2: పట్టణం లోని 5వార్డు జేఆర్‌పేటలోని ఇమ్మడి జనార్దన్, 19వ వార్డులోని కొత్త ఆదెమ్మ, 19వార్డు ము స్లింవీధికి చెందిన ఖాజారంతుల్లా మృతుల కుటుంబసభ్యులను శనివారం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర రెడ్డి పరామర్శించారు. ఒక్కొక్క కుటుంబా నికి రూ.10వేలు చొప్పున అందజేశారు. కష్ట కాలంలో ఆర్థికసాయం అందజేసిన కంచి పర మేశ్వరరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏఎస్ పేట పంచాయతీకి ఫ్రీజర్ వితరణ

ఏఎస్ పేట: ఏఎస్ పేట పంచాయతీకి సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పర మేశ్వరరెడ్డి శనివారం ఫ్రీజర్ (శవపేటిక)ను అందజేశారు. గ్రామ సర్పంచు భర్త షేక్‌జిలానీ బాషా ఆయనకు శాలువాతో సన్మానించారు. ఆత్మకూరులో వైకుంఠ రథం అందుబాటులో ఉందని, అవసరమైన వారు సమాచారం ఇవ్వాలన్నారు. హిందూ శ్మశానికి బోరు, షెడ్డు అవసరమని గ్రామస్థులు తెలుగా త్వరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కుడుముల సుధాకర్‌రెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, శేషారెడ్డి పాల్గొన్నారు.

'సూర్య ఘర్ ముఫ్త్‌బిజిలీ'ని సద్వినియోగం చేసుకోండి

ఉదయగిరి రూరల్, మార్చి 2: ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్‌బిజిలీ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉదయగిరి సబ్ డివిజన్ తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ వేగూరు సాయి కృష్ణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం కింద కేంద్రం ప్రతి ఇంటికి 300యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనుందని అవసరమైన సోలార్ ప్యానల్స్ కోసం పోస్టాఫీసులు, బ్రాంచ్ పోస్టాఫీసుల్లో లబ్ధిదారులు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 2కిలోవాట్ల సామర్థ్యం ఉన్న సోలార్ ప్యానల్స్ రూ.55 నుంచి రూ.65వేల వరకు అంచనా వ్యయం ఉంటుందని కేంద్రం రూ.30వేల రాయితీ కల్పిస్తుందన్నారు. సోలార్ ప్యానల్స్‌ను రాయితీతో పొందాలనుకునే వారు సమీప పోస్టాఫీసులను సంప్రదించాలన్నారు.

గురుకుల పాఠశాలలో సరస్వతీ పూజ

ఉదయగిరి రూరల్, మార్చి 2: గండిపాళెం బాలుర గురుకుల పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు శనివారం సరస్వతిదేవి పూజ నిర్వహించారు. ఈ ఏడాది జరిగే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులు వేడుకున్నారు. ప్రిన్సిపాల్ పుష్పరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు







పోలీసు అధికారులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం

● మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

కందుకూరు, మార్చి 2: కందుకూరు పోలీసు అధికారులు తమ బాధ్యతలు మరిచి వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్‌ను ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేయడంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ సమన్వయకర్తగా కందుకూరు వచ్చిన బుర్రాను పోలీసు అధికారులంతా ఏ హోదాలో కలిశారో నియోజకవర్గ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే పోలీసు అధికారుల తీరును కందుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నేతి మహేశ్వరరావు ఓ ప్రకటనలో ఖండించారు. ఒక పార్టీకి సమన్వయకర్తగా వచ్చిన వ్యక్తిని ఎన్నికల సమయంలో పోలీసు అధికారులంతా వెళ్లి వరుసగా పుష్పగుచ్ఛాలు అందజేసి రావడం ఎలాంటి సంకేతాలు ఇస్తుందో పోలీసు అధికారులు సమాధానం చెప్పాలన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

బిట్రగుంట, మార్చి 2: బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు, సంస్కృత పరీక్షలు శనివారం ప్రశాంతగా జరిగాయి. 102 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా ఒక్కరు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. కావలి రూరల్ సీఐ నాగభూషణం, ఎస్సై సుధాకర్‌రెడ్డిలు బందోబస్తును పరిశీలించారు.

సంగం: స్థానిక బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల కళాశాలలో శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సర తెలు గు పరీక్ష ప్రారంభమ య్యాయి. పరీక్షా కేంద్రం లో 210 మంది విద్యార్థుల్లో 201మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. కేంద్రం వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీతారామపురం: స్థానిక ఏపీ ఆదర్శ పాఠశాల కేంద్రంలో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. కేంద్రంలోకి హాల్ టిక్కెట్లు కలిగిన విద్యార్థులను మాత్రమే ఎస్‌ఐ అనూష ఆధ్వర్యంలోని పోలీసులు అనుమతించారు. 118 మంది విద్యార్థుల్లో 112మంది పరీక్షకు హాజరైనట్లు పరీక్షల డిపార్ట్మెంట్ చీఫ్ ముజీబుర్ రెహమాన్ తెలిపారు.



సీతారామపురంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

పబ్బులేటిపల్లి సచివాలయం తనిఖీ

సీతారామపురం: సచి వాలయ సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు తప్పనిస రి గా ఉండాలని ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ సూ చించారు. శనివారం ఆయ న పబ్బులేటిపల్లి సచి వాల యాలన్ని తనిఖీ చేసి మాట్లా డారు. సిబ్బంది ప్రజలకు ని త్యం అందు బాటులో ఉండి మెరుగైన సేవలందిం చాలన్నారు. విధిగా సమయపాలన పాటిం చాలని, ప్రతి రోజు మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు స్పందన కార్యక్రమం చేపట్టాలన్నారు. రిజిష్టర్లు పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ బాలినేని ప్రవీణ్ కుమార్ ఉన్నారు.



రిజిస్టర్‌లను పరిశీలిస్తున్న ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్

ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి

వరికుంటపాడు: టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల విజయానికి జనసైనికులు తమవంతు బాధ్యతగా కృషి చేయాలని జనసేన మండ లాధ్యక్షుడు పఠాన్ నాయబ్ రసూల్ కోరారు. శనివారం స్థానిక వసతిగృహం సమీపంలో నిర్వ హించిన ఆత్మీ య సమావేశంలో ఆయన మాట్లాడారు. అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త సైనికుడిగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లోను విస్తృ తంగా ప్రచారం చేపట్టి నియోజకవర్గంలో సైకిల్ గుర్తుకు ఓటు వేయించాలని సూచించారు. అనంతరం ఆయన్ను జనసైనికులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో యాదగిరి ప్రభాకర్, మేడిద వెంకటేశ్వర్లు, గోను కొండయ్య, బక్కా ఎలిషా, నిఖిల్, కార్తిక్, కేశవరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయబ్‌రసూల్

విజయ గణపతికి ప్రత్యేక పూజలు

బిట్రగుంట, మార్చి 2: బోగోలు మేజర్ పంచాయతీలో వెలసి ఉన్న విజయగణపతి స్వామికి ఆలయ 30వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం గణపతి పూజ, రుద్రాభిషేకలు భక్తులకు మధ్యాహ్నం అన్న సంతర్పణ చేశారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి భారీగా వలసలు



కావలి : టీడీపీలో చేరిన కావలి వైసీపీ నేతలు



చంద్రబాబుతో చెంచలబాబు



బిట్రగుంట : నెల్లూరుకు తరలిన తెలుగుతమ్ముళ్లు

కావలి, మార్చి 2: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నా యుడు సమక్షంలో శనివారం నెల్లూరులో వీపీఆర్ కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో కావలి వైసీపీ ముఖ్య నేత లు కొందరు టీడీపీలో చేరారు. వారికి చంద్రబాబు నాయుడు పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. మాజీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన సమీప బంధువైన కేతిరెడ్డి రామకోటారెడ్డి తనయుడు కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి వైసీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పదవికి రాజీనామ చేసి తన అనుచరులతో టీడీపీలో చేరారు. అలాగే కావ్య క్రిష్ణారెడ్డి ఆధ్వ ర్యంలో వైసీపీ వాణిజ్యవిభాగం కావలి పట్టణ అధ్యక్షుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్, వైశ్యప్రముఖుడు తిరువీధి ప్రసాద్, కావలి పట్టణ 40వ వార్డు వైసీపీ కన్వీనర్, జండాచెట్టు అహెలే సున్నత్ మసీదు ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ అన్సర్, గౌరవరం మాజీ ఎంపీటీసీ సురే జయశ్రీ, వైసీపీ నాయకుడు సురే శ్రీనివాసులు రెడ్డి, కావలి పట్టణ 26వ వార్డు వైసీపీ నాయకుడు ఇస్కు విక్రమరెడ్డిలు టీడీపీలో చేరారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న చేవూరి

జలదంకి : మండల వైసీపీ మాజీ కన్వీనర్, రాజ్యసభ మాజీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అనుచరుడు చేవూరి జనార్దన్‌రెడ్డి పలువురి వైసీపీ నాయకులతో కలసి నెల్లూరులో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయనకు చంద్రబాబు పసుపు కండువా వేసి ఆహ్వానించారు. చేవూరి సతీమణి సులోచనమ్మ మండలంలోని సోమవరప్పాడు సర్పంచుగా ఉన్నారు. త్వరలో తన అనుచరులతో కలసి పార్టీలోకి ఆహ్వానిస్తామని చేవూరి తెలిపారు. ఇదిలాఉండగా చంద్రబాబు నెల్లూరు పర్యటనకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు.

అనంతసాగరం : మండలంలోని పాతాళపల్లి సర్పంచు బిజివేముల ఓబుల్ రెడ్డి నెల్లూరులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తాన ని చెప్పారు.

పార్టీ కోసం నేను సైతం..

కందుకూరు: తెలుగుదేశం పార్టీ కోసం నేను సైతం అంటూ ఓ సాధారణ కార్యకర్త పలుకూరు గ్రామానికి చెందిన గట్టమనేని అశోక్ నెల్లూరులో టీడీపీ అధినేత చంద్రబాబును కలసి రూ.15వేలు విరాళం అందజేశారు.

నెల్లూరుకు తరలిన టీడీపీ శ్రేణులు

ఉదయగిరి రూరల్: నెల్లూరు వీపీఆర్ కన్వెన్షన్‌హాల్‌లో శనివారం జరిగిన చంద్రబాబునాయుడు కార్యక్రమానికి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ఎనిమిది మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలివెళ్లారు.

● రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కష్టించి పని చేయండి.. నీ రాజకీయ భవిష్యత్తుకు తాను భరోసా కల్పిస్తానని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చినట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ తెలిపారు. శనివారం నెల్లూరు వీపీఆర్ కన్వెన్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమానికి హాజ రైన చంద్రబాబును హెలీప్యాడ్ వద్ద చెంచలబాబు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

బిట్రగుంట : బోగోలు మండలంలోని పలు పంచాయతీలకు చెందిన టీడీపీ శ్రేణులు నెల్లూరులో శనివారం జరిగిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సభకు తరలి వెళ్లారు. కావలి నియోజకవర్గ నేతలు కావ్యకృష్ణారెడ్డి, మాలేపాటి సుబ్బానాయుడు పిలుపు మేరకు మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో తరలివెళ్లిన వారిలో జిల్లా నేతలు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, కాండ్ర రఘురామ్ నాయుడు, ఎల్.సుధీర్‌బాబు, ఏ.ఆదిశేషయ్య తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే మహీధరరెడ్డితో విజయసాయి రెడ్డి భేటీ

కందుకూరు, మార్చి 2: వైసీపీ నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి శనివారం సాయంత్రం కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర రెడ్డితో భేటీ అయ్యారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర రెడ్డి, మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కందుకూరు వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ తదితరులతో కలిసి మాచవరంలోని మహీధరరెడ్డి నివాసానికి చేరుకుని గంటకు పైగా చర్చలు జరిపారు. కొంత సమయం ఆయనతో ఏకాంతంగానూ చర్చలు జరిపారు.

'పది' ర్యాంకర్లకు బహుమతులు

కావలిటౌన్, మార్చి 2: రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు తన బీఎమ్మార్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు సమకూర్చారు. శనివారం విశ్వోదయ బాలురోన్నత పాఠశాలలో ప్రతి ఏడాదిలాగే బీఎమ్మార్ సతీమణి మంజుల పేరుతో గత ఏడాది పదో తరగతిలో ప్రథమ స్థానం పొందిన మహేష్‌కు రూ.7వేలు, ద్వితీయ స్థానం పొందిన సుమంత్‌కు రూ.3 వేలు బహుమతులను పాఠశాల కరస్పాండెంట్ విజయశంకర్‌రెడ్డి, ఎంఈవో 1 గోవిందయ్యల చేతుల మీదుగా అందించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ద్వారకానాథ్‌చౌదరి, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని సీ.శారద, ట్రస్ట్ ప్రతినిధులు సుధాకర్, ఖాదర్‌బాషా, మురళి, తదితరులు పాల్గొన్నారు.

'డీఎస్ఆర్'లో ఉచిత విద్యకు ప్రవేశ పరీక్ష

అల్లూరు, మార్చి 2 : మండలంలోని ఇందుపూరు కాలువ సమీపంలో ఉన్న దేవిరెడ్డి శారదా చారిటబుల్ ట్రస్ట్‌లో పేద విద్యార్థులకు ఉచిత విద్యకోసం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు అడ్మిన్ మేనేజరు అనిల్‌కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరు పరిసర ప్రాంతాల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు అర్హులన్నారు. ముందుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఆదివారం ఉదయం 8.30 గంటలకు, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఈనెల 10న పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు ప్రతీ విద్యార్థి ఆధార్ కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు.

పేదలకు బిర్యానీ పొట్లాల పంపిణీ

కావలి రూరల్, మార్చి 2: పోలీస్ కానిస్టేబుల్ మురళి, అనీల దంపతుల కుమార్తె ఓన్షితా పుట్టినరోజు సందర్భంగా శనివారం మండలంలోని ఆముదాలదిన్నె గిరిజనకాలనీలోని పేదలకు బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హ్యాపీ సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ ఘనీబాషా, లోక్ అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి, సంస్థ సభ్యులు చేవూరి ప్రభయ్య, షేక్ జమీర్, సయ్యద్ నౌషాద్, అలీ, హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కలిగిరి, మార్చి 2: కలిగిరి పంచాయతీ పరిధిలోని ఎర్రతోట ప్రాంతంలో నివసిస్తున్న పేదకుటుంబానికి చెందిన వంగపాటి చిన్నమ్మ కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కలిగిరి ఉపసర్పంచు పాలూరు కొండారెడ్డి, పాలూరి మాలకొండారెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆ కుటుంబానికి శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపతి శ్రీనివాసులురెడ్డి, కుట్టుబోయిన పవన్ తదితరులు పాల్గొన్నారు.

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

లింగసముద్రం, మార్చి 2: మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హుస్సార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 ఫీజు చెల్లించి పాఠశాల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏప్రిల్ 21న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మోడల్ స్కూల్‌లో 5వ తరగతి సిలబస్‌తో తెలుగు, ఇంగ్లీషు మీడియంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతిభ ఆధారంగా, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

వలేటివారిపాలెం : మండలంలోని చుండి ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 3 నుంచి ఏప్రిల్ 12వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీవెంకటేశన్ ఓ ప్రకటనలో తెలిపారు.

9వ వార్డులో ఇంటూరి సతీమణి ప్రచారం

కందుకూరు, మార్చి 2: పట్టణంలోని 9వ వార్డులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాబోయే టీడీపీ, జనసేన ప్రభుత్వంలో అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాల గురించి అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే శనివారం సాయంత్రం ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం 31వ వార్డు పరిధిలోని ఐఎస్ రావు నగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ, చెన్నారెడ్డి నరసమ్మ, దూదిపల్లి అఖిల, చదలవాడ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో ఇంటూరి సౌజన్య

గ్రామాల్లో 'బేటీ బచావో బేటీ పడావో'

బిట్రగుంట, మార్చి 2: బోగోలు మండలంలోని కొండబిట్రగుంట, కప్పరాళ్లతిప్ప గ్రామాల్లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వలన జరిగే నష్టాలు, ప్రభుత్వం తీసుకునే చర్యలపై చిరంజీవి కళాజాత బృందం రవితేజ, శారద, వరప్రసాద్ తదితర కళాకారులు బుర్రకథ, నృత్య ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కోటేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరులో 'వలంటీర్లకు వందనం'

కావలిటౌన్, మార్చి 2: పట్టణంలోని ముసునూరులో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి నివాసంలో శనివారం పట్టణ, రూరల్ మండల వలంటీర్లకు వందన సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



వలంటీర్లకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

పేదల ఇళ్ల దస్తావేజుల పంపిణీ

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పురపాలకసంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పేదలకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ దస్తావేజులను ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్ కుమార్, వైసీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సమావేశం

కలిగిరి, మార్చి 2: స్థానిక బీజేపీ కార్యాలయంలో శనివారం బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులకు ప్రధానమంత్రి మోదీ వ్యక్తిగతంగా రాసిన లేఖలను బీజేపీ కార్యకర్తల ద్వార అందించి వారి సూచనలు సలహాలు తీసుకొని యాప్‌లో నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నందనవనం ప్రభాకరరావు, చల్లా హనుమారెడ్డి, షాజహాన్, రమేష్‌రెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

కందుకూరు, మార్చి 2: వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన నిధులకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు శనివారం బాధితులకు అందజేశారు. ఉలవపాడు మండలం రామాయపట్నంకు చెందిన రాసాని శ్యామలకు రూ.1.54 లక్షలు, లింగసముద్రం మండల కేంద్రానికి చెందిన షేక్ నసీమాకు రూ.1.2 లక్షలు సీఎం సహాయనిధి నుంచి మంజూరు కాగా ఆ చెక్కులను అందజేశారు.

మాలకొండ ఆదాయం రూ.9,29,220

వలేటివారిపాలెం, మార్చి 2 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ.9,29,220 ఆదాయం వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టికెట్‌లకు రూ.7,150, కుంకుమార్చనకు రూ.26,680, వివాహములకు రూ.9 వేలు, తలనీలాల సమర్పణకు రూ.29,700, వాహనపూజలకు రూ.3,020, ప్రత్యేకదర్శనానికి రూ.2,04,200, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ.1,080, రూముఅద్దెలు రూ.33,960, కవర్లకు రూ.5,550, లడ్డూ ప్రసాదానికి రూ.2,03,010, అన్నదానానికి రూ.3,56,820, విరాళముల ద్వారా రూ.49,050 ఆదాయం లభించినట్లు తెలిపారు.

మున్సిపల్ వాణిజ్య సముదాయం ప్రారంభం

కందుకూరు, మార్చి 2: పట్టణంలోని రైతు బజారు సమీపంలో ఉన్న పాత లారీ స్టాండ్ స్థలంలో నూతనంగా నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కందుకూరు పట్టణం, రూరల్ మండల పరిధిలో జగనన్న లే అవుట్లలో నివాస స్థలాలు, గృహాలు అందజేసిన లబ్ధిదారులకు శనివారం హక్కు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహీధరరెడ్డి

పోలియో రహిత సమాజాన్ని స్థాపిద్దాం



బుచ్చిరెడ్డిపాళెం : పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు.

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 2: పోలియో రహిత సమాజ స్థాపనకు పిల్లలకు పోలియో చుక్కలు తప్పక వేయించాలని హెచ్‌ఎం శ్రీనివాసులు రెడ్డి అన్నారు. శనివారం నగర పంచాయతీలోని రామచంద్రాపురంలో అంగన్వాడీ ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐదు సంవత్సరాల్లోపు పిల్లలకు ఆదివారం నుంచి మంగళవారం వరకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్సు సభ్యుడు గండికోట సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు వేదవతి, నిర్మల, బ్రహ్మారెడ్డి, మున్వర్, విజయకుమారి, స్వర్ణలత, ధనమ్మ విద్యార్థులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ

ఇందుకూరుపేట: మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 8 సచివాలయాల పరిధిలో ఆదివారం నిర్వహించ తలపెట్టిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి శనివారం అవగాహన ర్యాలీలు మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ సి కిషోర్‌కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వర నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. చిన్నారులకు పోలియో చుక్కలు తప్పక వేయించాలని బ్రహ్మేశ్వర్‌నాయుడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్‌లు రమా, సతీష్‌బాబు, ఫార్మాసిస్ట్ చంద్రశేఖర్, పల్స్‌పోలియో రూట్ ఆఫీసర్లు మాధవ, ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ



సరస్వతి పూజలో పాల్గొన్న ఉపాధ్యాయులు

పొదలకూరు, మార్చి 2: పట్టణంలోని అమరావతి పాఠశాలలో శనివారం సరస్వతీదేవి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కే సురేష్, మంజుల దంపతులు హోమం నిర్వహించి సరస్వతీదేవికి పూజలు నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించారు. మధ్యాహ్నం నుంచి విద్యార్థులకు ఫేర్వెల్ పార్టీ నిర్వహించారు. ఫార్మాటివ్ అసెస్మెంట్ ఐవీలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్‌ఫెయిర్



ప్రాజెక్టులను తిలకిస్తున్న చైర్మన్ శ్రీనివాసులురెడ్డి

ముత్తుకూరు, మార్చి 2: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్‌లు దోహదం చేస్తాయని వీబీఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఊటుకూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం ముత్తుకూరు వీబీఆర్ హైస్కూల్‌లో వైస్ చైర్మన్ శైలజారెడ్డితో కలిసి సైన్స్‌ఫెయిర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులను ప్రాజెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, అడ్మిన్ రాము, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మళ్ళదిబ్బ కాలనీ పరిశీలన



గుమ్మళ్ళదిబ్బ కాలనీలో పర్యటిస్తున్న పశుసంవర్ధక శాఖాధికారులు

కోవూరు, మార్చి 2: ఇటీవల కోళ్ళకు బర్డ్‌ఫ్లూ సోకిన గుమ్మళ్ళదిబ్బ కాలనీని శనివారం పశుసంవర్ధక శాఖాధికారులు పరిశీలించారు. ఇళ్లలో పెంచుకుంటున్న కోళ్ళ ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. కోళ్ళకు బర్డ్‌ఫ్లూ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని రైతులు, కూలీలు, మహిళలకు వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖాధి కారులు డాక్టర్ షబానా, డాక్టర్ ప్రీతిసాల్మన్, ఆరిఫ్ పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రైనీ రవికుమార్‌రెడ్డి

మనుబోలు, మార్చి 2: ఈవీఎంలపై ఎటువంటి అపోహలు వద్దని ఎంపీడీవో కార్యాలయ ఏవో, ఈవీఎంల ట్రైనీ రవికుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొన కుదురు, కట్టువపల్లి, పిడూరుపాళెం, బద్దెవోలు, వెంకన్నపాళెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో శనివారం ఈవీఎంలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు భగవాన్, నాగేశ్వరరావు, వీఆర్ఏ రమేష్, బీఎల్‌వోలు యాసర్, నరేష్, సురేష్, మురళీకృష్ణ, బాబురావు, శ్రీనివాసులు తదితరులున్నారు.

అర్హులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులివ్వండి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

నెల్లూరు(సిటీ), మార్చి 2: అర్హత కలిగిన వారందరికీ ప్రభుత్వం మంజూరు చేసిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య శ్రీ కార్డులను అందచేయాలని కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. శనివారం నగరంలోని బాలాజీనగర్, మేఘనావీధి, ఆదిత్యనగర్ ప్రాంతాల్లోని సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటికే మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులన్నిటిని వారి ఇళ్లకు తీసుకెళ్లి అందచేయాలని సూచించారు. ఆస్తి, ఖాళీ స్థలం, కొళాయి పన్నులను వేగవంతంగా వసూలు చేయాలన్నారు. రెండవ రోజు రోడ్లపైనున్న పశువులను తరలించే కార్యక్రమం నిర్వహించారు. ఓ చోట పశువుల యజమానులు తరలింపు వాహనాలను అడ్డుకున్నారు. దీంతో పోలీసుల సహకారంతో పశువులను గోశాలకు తరలించారు.

చంద్రబాబు సభకు భారీగా తరలిన టీడీపీ శ్రేణులు



దినేష్‌రెడ్డి నాయకత్వంలో బయలుదేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కోవూరు, మార్చి 2: నెల్లూరులో వీపీఆర్ కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటుచేసిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సభకు కోవూరు నియోజకవర్గ పరిధిలోని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, నాయకులు ఇంతా మల్లారెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, జెట్టి గోపిరెడ్డి, బాలరవి, నాటకరాని వెంకట్, తిరుమూరు అశోక్‌రెడ్డి నాయకత్వంలో మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పడుగుపాడు శివాలయం నుంచి వెళ్లారు.

ఎన్నికలలో టీడీపీ విజయం తథ్యం



టీచర్స్ కాలనీలో ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

పొదలకూరు, మార్చి 2: రాబోవు ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయం తథ్య మని టీడీపీ సీనియర్ నాయకులు బోగోలు భాస్కర్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ మైనారిటీసెల్ ఉపాధ్యక్షుడు షేక్ జమీర్‌బాషా అన్నారు. శనివారం టీడీపీ క్రిష్టియన్ మైనారిటీ సెల్ నాయకుడు దార్ల ఆశీర్వాదం, టీడీపీ మండల ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, తిరుపతి పార్లమెంటు బీసీ కార్యదర్శి వెంపులూరి అరుణ ఆధ్వర్యంలో పట్టణంలోని టీచర్స్ కాలనీలో బాబు సూపర్ సిక్స్ హామీలను ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి టీడీపీకి రెండు కళ్లలాంటివన్నారు. కల్లబొల్లి మాటలతో ఇంతకాలం ప్రజలను మోసం చేసిన వైసీపీ నేతల గుండెల్లో గుబులు మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు గుంటి రంగయ్య, షేక్.బాబు తదితరులు పాల్గొన్నారు.

కాకాణికి డిపాజిట్లు రాకుండా ఓడిస్తాం : బొబ్బేపల్లి



మాట్లాడుతున్న జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు

వెంకటాచలం, మార్చి 2: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సర్వేపల్లిలో వైసీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి డిపాజిట్లు రాకుండా ఓడించి ఇంటికి పంపిస్తామని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అన్నారు. మండలంలోని సర్వేపల్లిలో ఆపార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. తోటపల్లిగూడూరు మండలంలో తమ పార్టీ కార్యకర్తను వైసీపీ నాయకులు చెప్పారని పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారని, ఎలాంటి తప్పు చేయకపోయినా పోలీసులు స్టేషన్‌లో అర్ధరాత్రి వరకు ఎలా పెట్టుకుంటారని ప్రశ్నించారు. జనసైనికుల జోలికి వస్తే సహించమని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు గుమినేని వాణిభవాని, నాయకులు పినిశెట్టి మల్లికార్జున్, షేక్ రహీమ్, శ్రీహరి తదితరులున్నారు.

వవ్వేరు బ్యాంకు ఛైర్మన్‌గా 'టంగుటూరు'

● 5న బాధ్యతల స్వీకరణ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 2: వవ్వేరు బ్యాంకు ఛైర్మన్‌గా టంగుటూరు మల్లికార్జునరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీచేసినట్లు వవ్వేరు బ్యాంకు మేనేజరు శ్రీనివాసులు తెలిపారు. ఈమేరకు ఈనెల 5న మల్లికార్జునరెడ్డి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపడతారని తెలిపారు.

పేదలకు గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 2: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని శ్రీరాంనగర్‌లో బీజేపీ నాయకులు శనివారం పలువురు పేద మహిళలకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కరణం సుహాసినీ మాట్లాడుతూ ప్రధాని మోదీ ఉజ్వల పథకంతో ఉచిత గ్యాస్, స్వచ్ఛభారత్ కార్యక్రమంతో పేదలకు ఉచిత మరుగుదొడ్లు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాజీ ఎంపీటీసీ రామిశెట్టి రమణమ్మ, జిల్లా కార్యదర్శి కాసా శ్రీనివాసులు, గంట విజయమ్మ, పైడిమర్రి సుజన, గోళ్ళ నరసింహులు, పెంచలస్వామి, సురేంద్ర, వెంకటేశ్వర్లు, గురయ్య, మహిళలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరు

వెంకటాచలం, మార్చి 2 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, రావూస్ కళాశాలల్లో శనివారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరిగాయి. జూనియర్ కళాశాలలో ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

మాస్ కాపీయింగ్‌పై ఆరోపణలు



ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గుమికూడిన విద్యార్థులు

కాగా, రెండు పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరుగుతోందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. తాము కష్టపడి చదువుకొని వచ్చి పరీక్షలు రాస్తుంటే కొందరు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నారని విద్యార్థులే స్వయంగా బయటకు వచ్చి చెప్పడంతో పరీక్ష కేంద్రాల్లో మాస్‌కాపీయింగ్ జరుగుతున్నట్లు ఆరోపణలు నెలకొన్నాయి. దీనిపై ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎగ్జామినేషన్ చీఫ్‌గా విధులు నిర్వర్తిస్తున్న రత్నంను వివరణ కోరగా... తమ కేంద్రంలో ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగడం లేదని, పరీక్షలు చాలా పకడ్బందీగా జరుగుతున్నాయన్నారు.

బ్రహ్మోత్సవాల పనులకు వేలం పాటలు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 2: వచ్చేనెల 16నుంచి 26వ తేదీ వరకు జరిగే బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులోని శ్రీ కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి అధ్వర్యంలో శనివారం పలు పనులకు బహిరంగ వేలం, సీల్డు టెండర్లు నిర్వహించారు. విద్యుద్దీపాలంకరణను హరిబ్రహ్మ లైటింగ్ వారు 1,39,900 రూపాయలకు, పుష్పాలంకరణను వినాయక ఫ్లవర్ డెకరేషన్ వారు 2,99,500 రూపాయలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ చైతన్య, ఆలయ సిబ్బంది, పాటదారులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

చంద్రబాబు పర్యటనలో
జోష్





కోటంరెడ్డి, అజీజ్, వీపీఆర్‌తో చంద్రబాబు సమాలోచన




పార్టీలో చేరుతున్న కేతంరెడ్డి వినోద్, జబర్దస్త్ కిర్రాక్ ఆర్పీ



కిందపడిపోయిన కప్పిర శ్రీనివాసులుకు సాయం చేస్తున్న కార్యకర్తలు



డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ చేరిక

నెల్లూరు(సిటీ): నెల్లూరు నగర శివార్లలోని కను పర్తిపాడు వద్ద గల వీపీఆర్ కన్వెన్షన్‌లో శనివారం జరి గిన టీడీపీ అధినేత చంద్రబాబు కార్యక్రమానికి అంచ నాలకు మించి పార్టీ శ్రేణులు తరలి వచ్చాయి. జాతీయ రహదారి నుంచి వేదిక వద్దకు వెళ్లే మార్గమంతా పసుపుమయమైంది. పార్టీ జెండాలు, బ్యానర్లతో టీడీపీ కార్యకర్తలు సందడి చేశారు. జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా పార్టీ కేడర్ వాహనాల్లో తరలిరావడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాలను మళ్లించారు. కన్వెన్షన్ సెంటర్లో యువత చంద్రబాబుతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు. స్టేజిపైన చంద్రబాబుకు పుష్పగుచ్చాలు ఇచ్చేందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు, నూతన ఎమ్మెల్యే అభ్యర్థులు ఆసక్తిచూపారు. చంద్రబాబు ప్రసంగంలో ఘాటు వ్యాఖ్యలతోపాటు కాస్త చమత్కారాలు జోడించడంతో నాయకులు, కార్యకర్తలు కేరింతలుకొట్టారు.

● చంద్రబాబును కలిసిన జెన్ని

నెల్లూరు (వ్యవసాయం): చంద్ర బాబు నాయు డిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణ య్య వీపీఆర్ కన్వెన్షన్ హాల్లో కలిశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరు, సూళ్లూరుపేట అసెంబ్లీ స్థానాలు ఎస్సీ రిజర్వుడు అయినప్పటికీ 1983 నుంచి ఇప్పటి వరకు మాదిగలకు కేటాయించలేదంటూ వినతి పత్రం అందించారు. దీనికి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. జిల్లాలో మాదిగలకు ప్రత్యామ్నాయంగా చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.



టీడీపీలో చేరుతున్న కోడూరు కమలాకర్‌రెడ్డి..

నెల్లూరు రూరల్లో వైసీపీ నేత, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోడూరు కమలాకర్‌రెడ్డిని చంద్రబాబు నాయుడు కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. చంద్రబాబు ఆదేశానుసారం పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని కమలాకర్‌రెడ్డి చెప్పారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు



గోవర్ధన్‌రెడ్డి..

బుచ్చిరెడ్డిపాళెం : పెన్నాడెల్టా, వవ్వేరు బ్యాంకు మాజీ ఛైర్మన్ ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, బుచ్చి మండల పరిషత్ అధ్యక్షుడు మన్నేపల్లి శ్రీనివాసులు, జొన్నవాడ ఆలయ మాజీ ఛైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, 13వ వార్డు కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ వైసీపీకి రాజీనామా చేసి శనివారం నెల్లూరులో నారా చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి చంద్రబాబు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

న్యాయవాదులకు క్యారమ్స్ పోటీలు



క్యారమ్స్ పోటీలు ప్రారంభిస్తున్న న్యాయమూర్తి యామిని

నెల్లూరు (లీగల్), మార్చి 2 : నెల్లూరు న్యాయవాదుల బార్ అసోసియేషన్ వార్షికోత్సవంలో భాగంగా శనివారం న్యాయవాదులకు క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. బార్ అసోసియేషన్ హాలులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ యామిని వీటిని ప్రారంభించారు. పలువురు న్యాయాధికారులు, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీ ఉమామహేశ్వర్ రెడ్డి, మద్దిబోయిన సుందర య్య యాదవ్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కే వాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు న్యాయవాదులు పోటీల్లో ప్రతిభ చాటారు. వార్షికోత్సవానికి వ్యాఖ్యాతగా సీనియర్ న్యాయవాది కొండూరు శేషారెడ్డి వ్యవహరిస్తున్నారు.

కర్మక్రతువుల భవన్ ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం) : నగర ఎమ్మెల్యే అనిల్ తన సొంత నిధులతో బాలాజీనగర్ సమీపంలో పీటీజీ పెట్రోలు బంకు వద్ద నిర్మించిన కాశీవిశ్వేశ్వర బ్రాహ్మణ కర్మక్రతువులు భవనాన్ని శనివారం ప్రారంభించారు. బ్రాహ్మణ సంఘానికి అవసరమైన వసతులు సమకూరుస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటరు కర్తం ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మూలస్థానేశ్వర ఆలయ ఛైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, నేతాజీ సుబ్బారెడ్డి, అఖిల బ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు అవధానం సాయికుమార్ పాల్గొన్నారు. అనంతరం జరిగిన సర్వసభ్య సమావేశంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మైలవరపు మురళీమోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జంగా శ్రీనివాసరావు, సభ్యులను ఎన్నుకున్నారు.

థైరాయిడ్‌కు అరుదైన శస్త్రచికిత్స

నెల్లూరు (వైద్యం), మార్చి 2 : ప్రాణాంతకంగా మారిన థైరాయిడ్ గడ్డకు నారాయణ ఆసు పత్రిలో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆసుపత్రిలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కడప జిల్లా బద్వేలుకు చెందిన రసూల్‌బీ(43) ఏడేళ్లుగా థైరాయిడ్‌తో బాధపడు తోందని చెప్పారు. ఆసుపత్రికి వచ్చిన ఆమెకు వైద్య పరీక్షలు చేయగా థైరోటాక్సి కోసిస్‌గా నిర్ధారణ అయిందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మహిధర్ రెడ్డి, డాక్టర్ వెంకట హరీష్, ఎండోక్రైనా లజిస్ట్ డాక్టర్ సునంద, డాక్టర్ కృష్ణ చైతన్య, డాక్టర్ రజిత, డాక్టర్ కస్యప్, ఏజీఎం శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

దొంగస్వామి నుంచి భూమి స్వాధీనం చేసుకోవాలి

నెల్లూరు (సాంస్కృతికం): గుడ్లూరు మండలం చేవూరులో సర్వే నెంబరు 883 అటవీ భూమిని ఆక్రమించిన దొంగ స్వామి నుంచి ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో దొంగ స్వామి లీలలను వివరించారు. రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వులను కింది స్థాయి అధికారులు పట్టించుకోవడం లేద ని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రఘు, జిల్లా అధ్యక్షుడు శ్రీ నివాసరావు పాల్గొన్నారు.


పవన్ కల్యాణ్ వెనుక నడవడానికి సిద్ధం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 2: ఎన్నో అవమానాలు ఎదుర్కొని సమాజ శ్రేయస్సు కోసం ముందుకు నడుస్తున్న జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వెనుక నడవడానికి సిద్ధంగా ఉన్నామని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తెలిపారు. నగరంలోని సుబేదారుపేటలో గల జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం సోషల్ జస్టిస్ ఆర్గనైజేషన్ టీమ్ సభ్యులు జనసేనలో చేరారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో పవన్ కల్యాణ్ క్షుణ్ణంగా ఆలోచించి తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు. ఎన్ని స్థానాలు అన్నది తమకు అవసరం లేదని, పవన్‌కల్యాణ్ ఏం చెప్తే అది చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ ఆర్గనైజేషన్ టీమ్ కోటయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి
జిల్లా వార్తలు

ఆదివారం 3 మార్చి 2024

శ్రీకాళహస్తికి ఉత్సవ కళ









భక్త కన్నప్ప

●ముక్కంటి శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



ముక్కంటి ఆభరణాలు

శ్రీకాళహస్తి, మార్చి 2: భవుడి మహా శివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళహస్తి సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ముక్కంటి ఆలయాన్ని ముచ్చటైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. గోపురాలు కొత్త రంగులతో కళకళలాడుతున్నాయి. భక్తకన్నప్ప, రామసేతు వంతెనల పైనా, పట్టణవ్యాప్తంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. అరటిచెట్లు, మామిడాకుల పచ్చతోరణాలు, కాషాయరంగు జెండాలతో వీధులు దర్శనమిస్తున్నాయి.భక్తుల కోసం ఆలయంలో చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. చతుర్మాడ వీధులు, సాంస్కృతిక కార్యక్రమాల వేదికైన ధూర్జటి కళా ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. సన్నిధివీధిలో ఏర్పాటు చేస్తున్న కైలాసం సెట్టింగ్ పనులు జోరందుకున్నాయి. రథాలు, నారద పుష్కరిణిలోని తెప్పలను రంగులతో ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని బ్యాంకు లాకర్లో ఉన్న జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడి ఆభరణాలను శనివారం ముక్కంటి ఆలయానికి చేర్చారు. ఉత్సవాల్లో స్వామి, అమ్మవార్లు ఈ ఆభరణాలను ధరిస్తారు.



ఆలయంలో పూల అలంకరణలు

కన్నప్ప ధ్వజారోహణంతో నేడు ప్రారంభం

శ్రీకాళహస్తీశ్వరాలయ మహా శివరాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తకన్నప్ప ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. పరమశివుడి వరంతో కన్నప్పగా మారిన తిన్నడికి కొండపై స్థానమిచ్చి, కిందిభాగంలో దేవదేవుడు కొలువైన పుణ్యక్షేత్రమిది. దీంతో భక్తుడు కన్నప్పకు తొలి పూజ చేసి ఉత్సవాలకు అంకురార్పణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. 14 రోజులు జరిగే శివరాత్రి ఉత్సవాల్లో ప్రథమంగా కన్నప్ప ధ్వజారోహణం జరగనుంది. ఇందులో భాగంగా ఆదివారం ఆలయ అలంకార మండపం నుంచి భక్త కన్నప్ప ఉత్సవ మూర్తిని కొండపైకి ఊరేగింపుగా తీసుకువెళ్తారు. అక్కడ వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి, శాస్త్రోక్తంగా కన్నప్ప ధ్వజారోహణం మహాక్రతువును నిర్వహించి దేవతలకు ఆహ్వానం పలుకుతారు.

ఆకట్టుకుంటున్న విద్యుదలంకరణలు



కన్నప్ప ఆలయం

వైసీపీలో వర్గపోరు తారస్థాయికి

- పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు
- ముఖ్య నేతలు సహా 8మందిపై అట్రాసిటీ కేసుల నమోదు
- నిందితుల్లో డీసీసీబీ ఛైర్మన్, ఎంపీపీ, సర్పంచ్ తదితరులు

పెళ్లకూరు, మార్చి 2: వైసీపీలో వర్గ పోరు తారస్థాయికి చేరుకుంది.ఓ వర్గం చేపట్టే అక్రమ గ్రావెల్ తవ్వకాలను మరో వర్గం అడ్డుకున్న క్రమంలో ఇరు వర్గాలూ దళితుల ద్వారా ఫిర్యాదులు చేయించాయి. రాజీ కుదిర్చేందుకు పార్టీ అగ్ర నేతలు చేసిన యత్నాలు ఫలించలేదు. దీంతో ఇరువర్గాలపైనా ఎస్సీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి పోలీసులు చేతులు దులుపుకున్నారు. పెళ్ళకూరు మండలం బంగారంపేట చెరువు నుంచీ ఎమ్మెల్యే వర్గానికి చెందిన కొందరు నాయకులు గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు.గురువారం సాయంత్రం సూళ్ళూరుపేట పట్టణ వైసీపీ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి కొంతమంది అనుచరులతో కలసి చెరువు వద్దకు వెళ్ళి తవ్వకాలను అడ్డుకున్నారు.ఆ మండలానికి చెందిన నెల్లూరు డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డికి ఈ విషయం తెలిసి పెద్దసంఖ్యలో అనుచరులతో అక్కడికి చేరుకుని శేఖర్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. సూళ్ళూరుపేట వైసీపీ నేతకు పెళ్ళకూరు మండలంలో ఏం పనంటూ ప్రశ్నించగడంతో పరస్పరం తోపులాడుకుని దుస్తులు కూడా చించుకున్నారు.ఇరు వర్గాలూ ఫిర్యాదు చేసినప్పటికీ శుక్రవారం మధ్యాహ్నం వరకు కేసులు నమోదు చేయకపోవడంతో నాయుడుపేట సర్కిల్ కార్యాలయం ఎదుట సత్యనారాయణరెడ్డి తన వర్గీయులతో ధర్నాకు దిగారు.ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి కళత్తూరు శేఖర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, నరేష్‌రెడ్డిలపై అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి.ఈ విషయం తెలుసుకున్న మరో వర్గం మోదుగుల పాలెం దళితకాలనీకి చెందిన ముత్యాలయ్యను కులం పేరుతో దూషించి దాడికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నాయుడుపేట సర్కిల్ ఆఫీసుకు స్థానిక ఎస్ఐ శ్రీకాంత్‌ను పిలిపించుకుని డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, చిల్లకూరు సర్పంచు పగడాల హరిబాబురెడ్డి, అదే గ్రామానికి చెందిన పిల్లమిట్ట వంశీకృష్ణ, శిరసనంబేడు గ్రామానికి చెందిన గెడ్డాం వెంకటకృష్ణారెడ్డి, నెలబల్లి గ్రామానికి చెందిన ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డిలపై అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. వైసీపీకే చెందిన రెండు వర్గాల్లో ముఖ్య నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు కావడం అధికార పార్టీలో కలకలం రేపుతోంది.

సమన్వయ బాధ్యత ఎమ్మెల్యేదే

సూళ్లూరుపేట అసమ్మతి నేతల సమావేశంలో పెద్దిరెడ్డి

తప్పు చేసి వుంటే క్షమాపణలన్న ఎమ్మెల్యే కిలివేటి

సూళ్లూరుపేట, మార్చి 2: సూళ్లూరుపేటలో మన పార్టీ పరిస్థితి బాగాలేదని అధ్యక్షుడు జగనే తనకు చెప్పారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అన్నారు. శనివారం సూళ్లూరుపేటలో నియోజకవర్గంలోని వైసీపీ అసమ్మతి నేతలతో చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే నడుమ సమన్వయం లేకపోవడంతో పార్టీకి గడ్డుకాలం వచ్చిందని,చక్కదిద్దమని చెప్పి తనను పంపారని ఆయన వివరించారు.చిన్నపాటి సమస్యలొచ్చినా అందరినీ సమన్వయం చేసుకొని ముందుకు సాగాల్సిన బాధ్యత ఎమ్మెల్యే సంజీవయ్యదేనని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ తాను ఎవరికీ అన్యాయం చేయలేదని, పార్టీ నాయకుల్లో ఒకరికి న్యాయం చేసే సమయంలో ఇంకొకరికి అన్యాయం జరిగి ఉండవచ్చన్నారు. అలాంటివి మరోసారి జరగవన్న ఆయన తప్పుచేసి ఉంటే క్షమించాలని కోరారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ గాలి వీస్తోందని సీఎం నుంచి సీనియర్ నాయకుల దాకా చెబుతున్నా పెద్దఎత్తున నాయకులు పార్టీని వదిలి వెళ్తున్నారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ఒంటెద్దు పోకడ, పార్టీ జెండాలు మోసిన వారిని విస్మరించడం వల్లే నేడు పార్టీకి ఈ దుస్థితి వచ్చిందన్నారు. మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి మాట్లాడుతూ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న వారికి ప్రాధాన్యత లేకుండా పోయిందని, ఎమ్మెల్యే మౌనంగా ఉన్నప్పటికీ ఆయన వర్గీయులు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.గూడూరుకు చెందిన సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, కళత్తూరు శేఖర్ రెడ్డి, తంబిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, మధుసూదన రెడ్డి, కళత్తూరు సునీల్ రెడ్డి, మారబత్తిన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



అసమ్మతి నేతల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి



మీడియా సమావేశంలో జడ్పీటీసీ మురళీధర రెడ్డి తదితరులు

జడ్పీటీసీకి లేని ప్రొటోకాల్

- వడమాలపేట వైసీపీ జడ్పీటీసీ మురళీధర రెడ్డి

మంత్రి రోజా అన్నకెవరు ఇచ్చారు?

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 2: జడ్పీటీసీలకు లేని ప్రొటోకాల్ మంత్రి రోజా అన్నకు ఎవరిచ్చారని వడమాల పేట జడ్పీటీసీ మురళీధర రెడ్డి ప్రశ్నించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల వడమాలపేటలో రూ.50లక్షల తుడా నిధులతో సీసీ డ్రెయిన్లు నిర్మించడానికి చేసిన భూమిపూజలో ఏ అధికారంతో రోజా అన్న రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. అన్నదమ్ములతో కలిసి నగరి నియోజకవర్గాన్ని రోజా దోచేస్తున్నారని ఆరోపించారు. తాను జిల్లా పరిషత్ సభ్యుడి హోదాలో గత నెల 25న అప్పలాయగుంటలో సచివాలయం, పత్తిపుత్తూరులో పాలశీతలీకరణ కేంద్రం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభిస్తే అవే భవనాలను శనివారం మంత్రి రోజా ప్రారంభించడమేంటన్నారు. ఏ ప్రజాప్రతినిధికీ ఇంతటి ఘోరావమానం జరక్కూడదన్న ఆయన అధికారులపై ప్రైవేటు కేసు వేస్తున్నానని స్పష్టం చేశారు. అప్పలాయగుంటలో ప్రజలెవరూ మంత్రి రోజా కార్యక్రమానికి రాకపోవడంతో అక్కడ రద్దు చేసుకుని పత్తిపుత్తూరులో పాలశీతలీకరణ కేంద్రాన్ని, సచివాలయాన్నీ తనకు సమాచారం ఇవ్వకుండా వలంటీర్లు, ప్రభుత్వ అధికారులతో ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే నగరి నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు, వైసీపీ క్యాడర్ రోజాపై అసంతృప్తితో ఉన్నారని, ఎమ్మెల్యే టికెట్‌ను స్థానికులకు ఇస్తే గెలిపించుకుంటామని వైసీపీ అధిష్ఠానానికి సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అధికారులను మంత్రి రోజా మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వైసీపీ నాయకులు, భాస్కర్‌రెడ్డి, పరంధామయాదవ్, వాసుదేవరెడ్డి, జయచంద్రా రెడ్డి పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న లారీ

35మందికి గాయాలు



లారీ ఢీకొనడంతో దెబ్బతిన్న బస్సు

పెళ్లకూరు, మార్చి 2:పెళ్లకూరు మండల పరిధిలోని టెంకాయతోపు వద్ద 71వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో 35 మంది గాయపడ్డారు.పోలీసుల కథనం మేరకు....నెల్లూరు జిల్లా రాపూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నెల్లూరు నుంచి తిరుపతికి 55మంది ప్రయాణికులతో బయలు దేరింది. శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు వస్తున్న లారీ ఈ బస్సును ఎదురుగా వేగంగా ఢీనడంతో బస్సు డ్రైవర్ రవీంద్రతో పాటు 35మందికి గాయాలయ్యాయి.పాలచ్చూరు సర్పంచు పెళ్లూరు షర్మిల, పైడాం వెంకటసుబ్బయ్య, పొదలకూరు మండలం చాడగుట్ల గ్రామానికి చెందిన కలివేటి సుబ్బయ్య, మణికుమారి తదితరులకు తీవ్రగాయాలవడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రంగా గాయపడ్డ సర్పంచు షర్మిల, సుబ్బయ్య



హథీరాంజీ మఠం భూములు

కొని మోసపోవద్దు

- మఠం ఫిట్‌పర్సన్ రమేష్‌నాయుడు

తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి):ప్రజలెవరూ హథీరాంజీ మఠానికి చెందిన భూములు సంబంధం లేని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి మోసపోవద్దని మఠం ఫిట్‌పర్సన్ రమేష్‌నాయుడు సూచించారు. తిరుమలలోని హథీరాంజీ మఠంలో సీజ్ చేసి ఉన్న మహంతు గదిని శనివారం ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యవతి, జిల్లా ఎండోమెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, మఠం తాత్కాలిక మహంతు ఓం ప్రకాష్‌దాస్ తదితరులతో కలిసి రమేష్ నాయుడు తెరిచారు.లోపలున్న కొన్ని వస్తువులను స్వాధీనపరుచుకున్నారు. అనంతరం రమేష్ నాయుడు మీడియాతో మాట్లాడారు.ఇటీవల మఠానికి తాత్కాలిక మహంతుగా నియమితుడైన ప్రకాష్ దాస్‌కు నివాసం కోసమే గది తెరిచామన్నారు. మఠం భూముల్లోని ఆక్రమణలను తొలగించే విషయంలో తిరుపతి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోందన్నారు.ఆక్రమణలు తొలగించేందుకు తీసుకువెళ్లే పొక్లయినర్ ముందు కూర్చోవడంతో పాటు తమపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఇకనైనా తక్కువ రేటుకు వస్తున్నాయని కష్టపడి సంపాదించిన డబ్బును సంబంధం లేని వ్యక్తులకు ఇచ్చి మఠం భూములు కొనుగోలు చేయవద్దని సూచించారు. ఏరోజుకైనా మఠం భూములను స్వాధీనపరుచుకోవడంతో పాటు అందులోని కట్టడాలను కూల్చివేస్తామని హెచ్చరించారు.మఠానికి చెందిన భూములపై ధార్మిక పరిషత్ ప్రత్యేక సర్వే టీంను ఏర్పాటు చేసిందన్న ఆయన కబ్జాలో వున్న శాశ్వత నిర్మాణాలపై త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటుందన్నారు.మఠానికి గతంలో మహంత్‌గా ఉండి సస్పెండైన అర్జున్‌దాస్ తప్పించుకు తిరుగుతున్నారన్నారు.ధార్మిక పరిషత్ ఏర్పాటు చేసిన విచారణ కమిటీకి కూడా సహకరించలేదన్నారు. ఈ క్రమంలో కమిటీ అందజేసిన నివేదిక ఆధారంగా అర్జున్‌దాస్‌ను శాశ్వతంగా తొలగించినట్టు తెలిపారు. ఇకపై మఠానికి, ఆయనకు ఎలాంటి సంబంధం లేదన్నారు.అనధికారికంగా మఠం భూములను ఓ ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇచ్చేందుకు ఎంవోయూ కుదుర్చుకున్న ఆయన బంధుమిత్రులను మఠాల్లో వివిధ పోస్టుల్లో నియమించారన్నారు.మఠం నిధులను కూడా దుర్వినియోగం చేశారన్నారు.

అభివృద్ధిని ఆకాంక్షించే టీడీపీలో చేరికలు: పాశం



హరిచంద్రారెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, మార్చి 2: రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే వారు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరు హరిచంద్రారెడ్డి నెల్లూరులో చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరేందుకు వెళుతుండంతో తూర్పువీధిలోని ఆయన నివాసంలో నాయకులు గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ హరిచంద్రారెడ్డి టీడీపీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. అందరినీ కలుపుకుని రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేస్తామన్నారు. హరిచంద్రారెడ్డి మాట్లాడుతూ సోదర సమానులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి నడుస్తామన్నారు. ఆయనతో పాటు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్నామన్నారు. రానున్న ఎన్నికలు అహంకారానికి, అభిమానికి మధ్య జరుగుతున్నాయని, అందరం కలిసికట్టుగా టీడీపీ విజయానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీగా నెల్లూరుకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వాటంబేడు శివకుమార్, ప్రణీత్, పెంచలయ్య, సురేంద్ర, దయాకర్, భారతి తదిరులు పాల్గొన్నారు.

రూ.85లక్షలతో అభివృద్ధి పనులు

గూడూరు, మార్చి 2: గూడూరు మండలంలో జడ్పీ నిధుల నుంచి రూ.85లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని జడ్పీటీసీ సభ్యురాలు యామిని తెలిపారు. శనివారం మండలంలోని నెల్లటూరు గ్రామంలో వైసీపీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో అంగన్వాడీ కేంద్రాలు, సిమెంటు రోడ్లను అభివృద్ధి పరచడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి రానున్న ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మహేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పెంచలరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి



విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రయోగాల నమూనాలను పరిశీలిస్తున్న శ్రీనివాసులురెడ్డి

నాయుడుపేట టౌన్, మార్చి 2: చిన్ననాటి నుంచే విద్యార్థులు సైన్స్‌పైన మక్కువ పెంచుకోవాలని శ్రీవేమ విద్యాసంస్థల అధినేత శ్రీనివాసులురెడ్డి అన్నారు. పట్టణంలోని విద్యాకేంద్ర ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోగలుగుతారని అన్నారు. విద్యార్థులు తయారు చేసిన ఎలక్ట్రానిక్, రాకెట్ నమూనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యాకేంద్రం పాఠశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి, ఉపాధ్యాయులు సురేష్‌రెడ్డి, జమీలాబీబీ, విజయ, ఉషా, భారతి, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కోట, మార్చి 2: మండల పరిధిలోని చిట్టేడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కోటి మృతి చెందినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. చేపల లోడుతో వెళ్తున్న ఆటో ఆర్టీసీ బస్సును ఢీకొన్న సంఘటనలో గాయపడిన కోటిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

పంచాయతీరాజ్‌శాఖ అధికారులకు సన్మానం

గూడూరు, మార్చి 2: పంచాయతీరాజ్‌శాఖలో విధులు నిర్వహిస్తూ రిటైర్ అయిన ఈఈ గిరినాథ్, డిప్యూటీ ఈఈ కేవీరవీంద్రకుమార్‌ను స్థానిక పంచాయతీరాజ్‌శాఖ కార్యాలయంలో శనివారం చీఫ్ ఇంజనీర్ బాలునాయక్ ఆధ్వర్యంలో న్మానించారు. అనంతరం ఇంజనీర్లతో పలు అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో శంకర్ నారాయణ, రియాజ్ ఆహ్మద్, విజయానంద దయాల్, రమణయ్య, లక్ష్మీనారాయణ, రామచంద్రయ్య, కృష్ణబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో డీఈవో తనిఖీలు



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డీఈవో శేఖర్

కోట, మార్చి 2: కోటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను శనివారం డీఈవో శేఖర్ చేశారు. రికార్డులు, ఉపాధ్యాయుల హాజరు పట్టీని పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన తీరును స్వయంగా పర్యవేక్షించారు. ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను పరిశీలించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. విద్యార్థినులకు వండి పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అన్నం, కూరలను రుచిచూశారు. భోజన నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎంఈవో మస్తానయ్య, హెచ్ఎం విజయభాస్కర్, తదితరులు ఉన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయండి

నాయుడుపేట, మార్చి 2: మున్సిపాలిటీ పరిధిలో గ్యాస్ పైపులైన్ కోసం తవ్వకాలు జరిపిన రోడ్లకు మరమ్మతులు చేయాలని మున్సిపల్ కమిషనర్ జనార్దనరెడ్డి అన్నారు. శనివారం ఆయన గ్యాస్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. పైపులైన్ పనులు పూర్తయిన వెంటనే కాంక్రీట్‌తో మరమ్మతులు చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే తవ్వకాల అనుమతి రద్దు చేస్తామన్నారు.

చోరీపై కేసు

కోట, మార్చి 2: మండల పరిధిలోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాసులు ఇంట్లో చోరీ జరగడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. శ్రీనివాసులు ఇంట్లో తలుపులు పగలగొట్టిన దొంగలు రూ.84వేల నగదు, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారని బాధితుడు ఫిర్యాదు చేయడంతో ఆ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

31లోగా బకాయిలు చెల్లిస్తే వడ్డీ మాఫీ

గూడూరు, మార్చి 2: పట్టణంలో మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఖాళీ స్థలం, ఇంటి పన్నుల బకాయిలను మార్చి 31వ తేదీలోపు చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీమాఫీ చేస్తుందని కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణదారుల ట్రేడ్ లైసెన్స్ ఫీజును మార్చి నెలాఖరులోగా చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

ఆరు మద్యం బాటిళ్ల స్వాధీనం

బాలాయపల్లి, మార్చి 2: మండలంలోని మేల్చూరు గ్రామంలో ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నాగార్జున అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మహబూబ్ సుభానీ తెలిపారు.

రావిగుంటపాళెం సర్పంచు మృతి



సురేంద్రరెడ్డి (ఫైల్‌ఫొటో)

వాకాడు, మార్చి 2: వాకాడు మండలంలోని రావిగుంటపాళెం గ్రామ సర్పంచు దేవారెడ్డి సురేంద్రరెడ్డి(55) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సురేంద్రరెడ్డి మృతిపట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

రెండు లారీల ఢీ
డ్రైవరుకు తీవ్ర గాయాలు

ఓజిలి, మార్చి 2: ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్ రోడ్డుకు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన లారీ డ్రైవరు సూరయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ రవిబాబు కథనం మేరకు... చెన్నై నుంచి ఒంగోలుకు వెళుతున్న లారీ ముందు వెళుతున్న లారీ హఠాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవరు సూరయ్యకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిబాబు తెలిపారు.

బైకు బోల్తా: మహిళకు గాయాలు

బాలాయపల్లి, మార్చి 2: మోటారు బైకు బోల్తాపడి ఓ మహిళ గాయాలపాలైన సంఘటన శనివారం బాలాయపల్లి చోటు చేసుకుంది. నెల్లూరుకు చెందిన వల్లూరు కోదండరామయ్య, ఆయన భార్య సుమిత్ర వెంకటగిరిలో బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి నెల్లూరు వెళుతుండగా బాలాయపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న స్పీడు బ్రేకరు కనిపించక పోవడంతో అదుపుతప్పి బైకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సుమిత్రకు తీవ్ర గాయాలవడంతో 108 వాహనంలో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.





ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన చంద్రబాబుతో టీడీపీ ముఖ్య నాయకులు- సభలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

వీపీఆర్ వర్గం చేరికతో టీడీపీలో జోష్

నెల్లూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి/సిటీ): ఓ వైపు తెలుగుదేశం పార్టీ శ్రేణులు, మరోవైపు మిత్రపక్షం జనసేన సైనికులు.. ఇంకోవైపు వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు తరలివచ్చిన నాయకులు, వారి అనుచరులతో శనివారం నెల్లూరులోని గొలగమూడి ప్రాంతం పోటెత్తిపోయింది. వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్ కిటకిటలాడింది. కొత్త నాయకుల చేరికలు, పాత కార్యకర్తల కేరింతల నడుమ టీడీపీ అధినేత చంద్రబాబు ఉత్సాహంగా కనిపించారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి దంపతుల వ్యక్తిత్వాన్ని ప్రశంసించారు. ఇప్పటికే ముగ్గురు నాయకులు ఆనం, శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి చేరికతో బలంగా ఉన్న నెల్లూరులో చివరి బ్రహ్మాస్త్రంలా వీపీఆర్, ఆయన వర్గీయుల చేరికతో ఇక తిరుగుండదన్నారు. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఐదు ఎన్నికలకు అభ్యర్థులను ఎంపిక చేశానన్నారు. ఏ ఎన్నికల్లో లేనివిధంగా ఈసారి అన్ని కోణాల్లో ఆలోచించి కట్టుదిట్టంగా అభ్యర్థులను ఎంపిక చేశానని చెప్పారు. చివరికి వీపీఆర్‌ను పార్టీలో తీసుకోవడానికి ముందు ఆయన గురించి ప్రజాభిప్రాయం తెలుసుకున్నానని అన్నారు. ఆయన డబ్బు కోసం రాజకీయాల్లో రాలేదు.. సేవ కోసం వచ్చారనే అభిప్రాయమే వ్యక్తమయ్యిందన్నారు. తెలుగుదేశం వీపీఆర్‌ను నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించడానికి ముందే వైసీపీ తన అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని ప్రకటించిందన్నారు. విశాఖను దోచుకుతిన్న విజయసాయిని ఇప్పుడు నెల్లూరు మీదకు పంపారన్నారు. అవినీతిపరుడైన విజయసాయి చివరి వరకు అభ్యర్థిగా ఉంటారో లేదో తెలియదని, ఒకవేళ ఉంటే చిత్తుచిత్తుగా ఓడించాలని చంద్రబాబు ప్రజలను కోరారు. 'నెల్లూరు జిల్లాలో తెలుగుదేశం బలంగా ఉంది. దానికి తోడు ఇటీవల వైసీపీ నుంచి కోటంరెడ్డి శ్రీధర్, ఆనం రామనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి చేరడంతో ఇంకా బలపడింది. చివరి అస్త్రంగా వీపీఆర్ చేరారు. నెల్లూరు జిల్లాలో ఇక పార్టీకి తిరుగులేదు' అని చంద్రబాబు అన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 11కు 11 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలను సునాయాసంగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు రాజకీయ చైతన్యం కలిగిన జిల్లా అని, ఇక్కడ జరిగే రాజకీయ పరిణామాలు రాష్ట్ర భవిష్యత్ పరిణామాలను తెలియజేస్తాయన్నారు. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ దేవుని కృపతో సాధ్యమైన మేర ప్రజలకు సేవ చేస్తున్నానని, మరింత ఎక్కువగా సేవ చేయాలంటే రాజకీయాల్లోకి రావాలని కొంత మంది చేసిన సూచనల మేరకు రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఇప్పుడు టీడీపీ అభ్యర్థిగా నెల్లూరు పార్లమెంట్‌కు పోటీ చేస్తున్నా. అందరూ మద్దతు ఇచ్చి గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల ద్వారా పేదల ఆకలి తీర్చిన వ్యక్తి చంద్రబాబయితే పళ్లెంలో అన్నం లాక్కున్న వ్యక్తి జగన్ అన్నారు. ఏపీలో జగన్ అధికారంలోకి వచ్చాక హత్యా రాజకీయాలు పెరిగిపోయాయని, అతని చిన్నాన్నను హత్య చేసిన వ్యక్తికి సహకరించే సీఎం మనకు అవసరం లేదన్నారు.

ఊరూరా చీలనున్న వైసీపీ ఓటు బ్యాంకు

వీపీఆర్‌తో పాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందలాది మంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. ఇటు కందుకూరు నుంచి అటు సూళ్లూరుపేట వరకు మున్సిపాలిటీలు, మండల, పంచాయతీల స్థాయిలో ప్రజలను ప్రభావితం చేయగలిగిన వారంతా సైకిల్ ఎక్కారు. వీరి చేరికతో టీడీపీకి రెండు రకాల ప్రయోజనాలు కలగనున్నాయి. టీడీపీ ఖాతాలోకి అదనపు ఓట్లు జమ కావడంతో పాటు ఇప్పటివరకు నాయకత్వమే లేని గ్రామాలు, పట్టణాల్లో టీడీపీకి పట్టు దొరికినట్లయింది. దాదాపుగా అన్ని మండలాల నుంచి వైసీపీ నాయకులు వలసొచ్చి టీడీపీలో చేరడంతో ఊరూరా వైసీపీ ఓటు బ్యాంకులో చీలిక అనివార్యంగా కనిపిస్తోంది.







చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కట్టా రమణారెడ్డి, సన్మానిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, పేరం మధుసూదన్ నాయుడుకు కండువా కప్పుతున్న చంద్రబాబు





మద్యం దుకాణం ఎదుట మందుబాబులు - ఇళ్ల ఎదుటే మద్యం తాగుతున్న దృశ్యం - అక్కడే పడేసిన గ్లాసులు

బాబోయ్... ఆ వీధిలో తిరగలేం!

- ఇళ్ల మధ్య మద్యం విక్రయాలు
- అక్కడే మందుబాబుల సిట్టింగ్
- కాశీపేట కూడలిలో ప్రజల అవస్థలు

వెంకటగిరి టౌన్, మార్చి 2: పట్టణంలోని కాశీపేట కూడలిలో మందుబాబుల బెడద ఎక్కువ కావడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాశీపేట కూడలిలో జనావాసాల మధ్య మద్యం దుకాణం నిర్వహిస్తున్నారు. ఎదురుగానే ఓ కూల్ డ్రింక్ షాపు వద్ద మద్యం సేవించేందుకు అనధికారికంగా అనుమతిస్తున్నారు. మద్యం కొనుగోలు చేసిన మందుబాబులు అక్కడే రోడ్డుపై తాగుతూ హల్‌చల్ చేస్తుండడంతో స్థానికులు తీవ్ర అసౌకార్యానికి గురౌతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం మందుబాబులు రోడ్డుపై తిష్టవేస్తుండడంతో మహిళలు బయట తిరగలేని పరిస్థితి నెలకొంది. ఖాళీ మద్యం బాటిళ్లు, తాగిన గ్లాసులు అక్కడే పడేస్తుండడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఈ విషయమై స్థానికులు పలుమార్లు పోలీసులకు తెలియజేశారు. వారం రోజుల క్రితం రాతపూర్వకంగా ఫిర్యాదు కూడా చేశారు. దీంతో ఓ కానిస్టేబుల్ వచ్చి దుకాణదారులతో మాట్లాడేసి వెళ్లిపోయారు. ఉన్నతాధికారులు స్పందించి ఇళ్ల వద్ద ఉన్న మద్యం దుకాణం, బెల్టు షాపులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదవశాత్తూ ఏటిలో పడి వ్యక్తి మృతి

బాలాయపల్లి, మార్చి 2: ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి ఏటిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బాలాయపల్లిలో శనివారం వెలుగులోకి వచ్చింది. బాలాయపల్లికి చెందిన తాళ్లూరు వెంకటేశ్వర్లు(44) శుక్రవారం గేదెలు మేపడానికి వెళ్లాడు. గేదెలు కనిపించకపోవడంతో వాటిని వెతుక్కుంటూ సమీపంలోని పొలాల్లోకి వెళ్లేందుకు ఏరు దాటుతుండగా నీళ్లలో చిక్కుకుని మృతి చెందారు. వెంకటేశ్వర్లు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా ఏటి గట్టున ఉన్న చెప్పులు కనిపించాయి. నీళ్లలో వెతకడంతో మృతదేహం లభ్యమైంది.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కోట, మార్చి 2: జిల్లాలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకులాల్లో 2023-24 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకులాల జిల్లా కన్వీనర్ నారాయణరావు శనివారం తెలిపారు. కోట(బాలురు) 120 సీట్లు, దొరవారిసత్రం (బాలురు) 80 సీట్లు, సత్యవేడు(బాలురు) 80 సీట్లు, ఐతేపల్లి (బాలురు) 40 సీట్లు, వెంటకగిరి (బాలురు)40 సీట్లు, గూడూరు(బాలికలు) 40 సీట్లు, ఉదయమాణిక్యం(బాలికలు) 80సీట్లు ఉన్నాయని నారాయణరావు తెలిపారు. బీసీ, ఈబీసీ, ఓసీ విద్యార్థులకు 9 నుంచి 11 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 9-13 సంవత్సరాల వయస్సు మించరాదన్నారు. జిల్లాలో 2022-22, 2023-24 విద్యాసంవత్సరాల్లో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3 నుంచి 4 తరగతులు చదివి ఉండాలన్నారు. ఈనెల 31వ తేదీ లోపు పాఠశాల వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నారాయణరావు తెలిపారు.

ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం
తొలిరోజు 675 మంది విద్యార్థుల గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి 2 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం 9-12గంటల వరకు జరిగిన సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2పరీక్షకు జిల్లాలో 675మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 87 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విభాగంలో 28,292మంది విద్యార్థులకుగాను 27,617మంది పరీక్ష రాశారని వెల్లడించారు. జనరల్ విభాగంలో 27,169మందికిగాను 26,569మంది విద్యార్థులు హాజరవ్వగా 600మంది హాజరుకాలేదు. ఒకేషనల్ విభాగంలో 1,123 మందికి 1,048మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాయగా, 75మంది గైర్హాజరైనట్లు వివరించారు. డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షలను పర్యవేక్షించాయి. సోమవారం ప్రథమ ఇంటర్ విద్యార్థులకు పరీక్ష జరగనుంది.



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, మార్చి 2: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రికి స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈవీఎంలు వద్దు... బ్యాలెట్ ముద్దు



విద్యానగర్‌లో ఈవీఎంలు వద్దంటూ పోస్టుకార్డులపై సంతకాలు చేస్తున్న స్థానికులు

కోట, మార్చి 2: మండల పరిధిలోని విద్యానగర్‌లో శనివారం సామాజిక కార్యకర్త షేక్ రఫీ ఆధ్వర్యంలో ఈవీఎంలు వద్దంటూ పోస్టుకార్డుల ఉద్యమం జరిగింది. గాంధీ బొమ్మ సెంటర్‌లో ప్రజల అభిప్రాయాలను పోస్టుకార్డుల ద్వారా సేకరించారు.

'చలో తిరుపతి'ని విజయవంతం చేయండి

నాయుడుపేట, మార్చి 2: చలో తిరుపతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తడుకు చందు అన్నారు. నాయుడుపేటలోని సీవీ రామన్ డిగ్రీ కళాశాలలో శనివారం ఏబీవీపీ స్టూడెంట్ మేనిఫెస్టో పోస్టర్లను విడుదల చేశారు. ఈ 5వ తేదీ తిరుపతిలో జరగనున్న సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు వినయ్, కుమార్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

85ఏళ్లు పైబడిన వారికి హోమ్ ఓటింగ్: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 2: 85 ఏళ్లు దాటి పోలింగ్ కేంద్రాలకు రాలేని వారికి హోమ్ ఓటింగ్‌కు అవకాశం ఉంటుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. శనివారం వివిధ పార్టీల నేతలతో సమావేశమైన ఆయన పలు అంశాలపై చర్చించారు. 2024 ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసే ముందు రోజు ప్రత్యేక బ్యాంకు ఖాతా, చెక్‌బుక్ కలిగి ఉండాలన్నారు. ఈఎస్ఎంఎస్, సి-విజిల్, ఈవీఎం వాడకంపై నోడల్ అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు.

అధ్వానంగా సర్వీసు రోడ్డు

గూడూరు, మార్చి 2: స్థానిక సొసైటీ సెంటర్ నుంచి రైల్వేగేటు వరకు ఉన్న సర్వీసు రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గూడూరు ఒకటి, రెండో పట్టణాలకు రాకపోకలు సాగించేందుకు 12 ఏళ్ల క్రితం ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపట్టారు. అర్థాంతరంగా నిలిచిపోయిన ఫ్లైఓవర్ పనులు ఆరు నెలల క్రితం మళ్లీ ప్రారంభమైనా నత్తనడకన సాగుతున్నాయి. ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయ్యే వరకు సొసైటీ కాలనీ నుంచి రైల్వేగేటు వరకు ప్రజల సౌకర్యార్థం తాత్కాలికంగా సర్వీసు రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ రోడ్డులోనే ఒకటో, రెండో పట్టణాలకు వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. కళాశాలలకు, పాఠశాలలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రైవేటు పరిశ్రమలకు వెళ్లేవారు ఈ దారిలోనే వెళ్లాల్సి ఉంటుంది. అయితే రోడ్డు మొత్తం గోతులమయంగా మారింది. మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలం బురదమయంగా అవుతుండడంతో వాహనదారులు అవస్థలు పడాల్సివస్తోంది. రాత్రి సమయంలో గోతులు కనిపించక ప్రమాదాలకు లోనవుతున్నామని ద్విచక్ర వాహనదారులు చెబుతున్నారు. అధికారులు స్పందించి సర్వీసు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోండి

చిల్లకూరు, మార్చి 2: కృష్ణపట్నం పోర్టులోని నౌకలో ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం, పోర్టుయాజమాన్యం ఆదుకోవాలని కులనిర్మూలన పోరాటసమితి రాష్ట్ర కోశాధికారి కావలి బాలయ్య అన్నారు. చిల్లకూర మండలంలోని ఏరూరు గ్రామానికి చెందిన యశ్వంత్, ముత్తుకూరుకు చెందిన కదివేలు పోర్టులోని నౌకలో ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను కేఎన్‌పీఎస్ సభ్యులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ యువకుల మృతిపై కలెక్టర్ విచారణ నిర్వహించి న్యాయం చేయాలన్నారు. పోర్టు యాజమాన్యం ఆర్థికంగా వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయకపోతే న్యాయ పోరాటం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పోలయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ



చిట్టేడులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కోట, మార్చి 2: మండల పరిధిలోని చిట్టేడులో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ జరిగింది. వైద్య సిబ్బంది చిట్టేడు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఐదేళ్ల లోపు పిల్లలకు విధిగా పోలియో చుక్కలు వేయించి యాలని పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ నాగరాజు, పెంచలయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

దక్కిలి, మార్చి 2: మండలంలో ఆదివారం నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దారు శ్రీనివాసరావు కోరారు. 5ఏళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ఇందుకోసం మండలంలో 61 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఆలయ కమిటీ కార్యవర్గ ఎంపిక



ఆలయ కమిటీ నూతన సభ్యులు

గూడూరు, మార్చి 2: స్థానిక ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడుగా బొమిడి శ్రీనివాసులు, సభ్యులుగా నరసింహారావు, విజయ, వినయ్‌కుమార్‌రెడ్డి, సంపూర్ణ, శ్రీనివాసులు, శ్రీవాణి, వెంకటరత్నమ్మ, శాంతిని ఎంపిక చేశారు. వీరి చేత ఆలయ ఈవో నవీన్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో తాను ఇదే ఆలయానికి పాలక మండలి చైర్మన్‌గా ఉన్న సమయంలో రూ.40లక్షలతో గాలిగోపురాన్ని నిర్మించడం జరిగిందన్నారు. పట్టణ ప్రజలు, పెద్దల సహకారంతో స్వామివారికి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు.